ప్రజాశక్తి
శుక్రవారం 1 సెప్టెంబర్ 2023
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి



రూ.200 తగ్గింపు ఉపశమనమా?

రూ.1150తో ఒకసారి 'బండ' కొంటే... జిల్లాలో రూ.102కోట్లు!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ జిల్లాలో గ్యాస్ కనెక్షన్‌లు 8,90,341 ఉన్నాయి. ఒకసారి గ్యాస్ బండ రూ.1150 వెచ్చించి కొనడం వల్ల అందరూ చెల్లించే మొత్తం రూ.102.38 కోట్లుగా ఉంది. కేంద్రంలోని మోడీ సర్కారు తాజాగా రూ.200 తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయం వల్ల అంటే రూ.950 వెచ్చించి కొంటే రూ.84.58 కోట్లు. అంటే వ్యత్యాసం రూ.17.80 కోట్లు. ఏళ్ల తరబడి ఈ మొత్తం భారం విశాఖ జిల్లాలో ఉండే గ్యాస్ వినియోగదారులపై పడిందనేది స్పష్టమవుతోంది. ఇప్పటివరకూ అత్యంత వేదనతో సామాన్యులంతా రూ.1150 పెట్టి గ్యాస్‌ను విడిపించుకోవడం ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. ఇన్నాళ్లూ లేని ఈ కాస్త ప్రేమ దేశ ప్రజలపై బిజెపి సర్కారుకు ఎందుకు ఊడిపడిందన్నది దేశంలో ఏ తరగతిని కదిలించినా 'బండ' బాదుడుపై రివర్స్ అవుతున్నవారే.. దేశంలోని 5 రాష్ట్రాల్లో త్వరలో జరుగనున్న ఎన్నికలను దృష్టిలోపెట్టుకుని మోడీ తీసుకున్న నిర్ణయాన్ని సరిగ్గానే ప్రజలు అంచనా వేశారు. ఎన్నికల జిమ్మిక్కుగానే సాధారణ ప్రజానీకం విశాఖలో అభివర్ణిస్తున్నారు. నెలల తరబడి కేంద్రం ముక్కుపిండి గ్యాస్‌పై రూ.వందల రూపాయలను వసూలు చేయడంపై పెదవి విరుస్తున్నారు. రూ.400 ఉండే గ్యాస్ బండ ధరను రూ.1150 దాటించేసిన ఘనతను (తాజాగా రూ.200లు తగ్గించినా సరే) తూర్పారబట్టడం ఎక్కడికక్కడ కనిపిస్తోంది. గడిచిన నాలుగు సంవత్సరాల్లో గ్యాస్ ధరలతో పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలంతా ఆర్థికంగా అతలాకుతలం అయిపోయినా చలించని మోడీ సర్కారు తన రాజకీయ ప్రయోజనం కోసం మాత్రం గ్యాస్ బండపై రూ.200 తగ్గించడంపై విశాఖ నగరంలో పలుచోట్ల జనం తమ ముచ్చట్లలో 'కంటితుడుపు రాజకీయంగా' చర్చలు చేయడం విశేషం. ఇదెంత మాత్రం ఉపశమనం కాజాలదన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మాతృ, శిశు మరణాలపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ) : జిల్లాలో మాతృ, శిశు మరణాలపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన గురువారం డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు, కమిటీ సభ్యులతో మాతృ, శిశు మరణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గర్భిణిగా నమోదైనప్పటి నుంచి ప్రసవించే వరకూ, ప్రసవానంతర సేవలు, సక్రమంగా అందేలా చూడాలని ఆదేశించారు. తదుపరి ఎంఆర్ వాక్సిన్‌పై జిల్లా టాస్క్ ఫోర్సు సమావేశం నిర్వహించారు. డ్రాపౌట్స్, లెఫ్ట్ అవుట్స్ పిల్లలను గుర్తించి ప్రణాళిక ప్రకారం శత శాతం వాక్సినేషన్ అందేలా చూడాలని ఆదేశించారు.

'గంగవరం' సమస్యపై చర్చలు

వివరాలు వెల్లడించిన మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి-విశాఖపట్నం : సమస్యలపై రెండు నెలలుగా గంగవరం పోర్టు కార్మికులు దీక్ష చేస్తున్న నేపథ్యంలో గురువారం సాయంత్రం విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పోర్టు కార్మిక నాయకులతో చర్చలు జరిగాయి. చర్చల అనంతరం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వివరాలు వెల్లడించారు. విధుల నుంచి యాజమాన్యం సస్పెండ్ చేసిన ఐదుగురు కార్మికులను ఎటువంటి కండిషన్ లేకుండా తిరిగి విధులలోకి తీసుకోవడం, ప్రమాదంలో మరణించిన కార్మికులకు గతంలో ఉన్న రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియాను రూ.25 లక్షలు చెల్లించేందుకు, 2024 ఏప్రిల్ 1వ తేదీన మంజూరుచేసే వార్షిక ఇంక్రిమెంట్‌తో అదనంగా రూ.1500 చెల్లించుటకు యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. కార్మికులు మెడికవర్, కేర్, అపోలో, గాయిత్రి విద్యా పరిషత్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకునేలా హెల్త్ కార్డులను మంజూరు చేస్తారని చెప్పారు. రాబోయే 10 నుంచి 15 రోజుల్లో రూ.10 వేలు బోనస్‌గా చెల్లించనున్నట్లు వివరించారు.

పై అంశాలకు సంబంధించి రాత పూర్వకంగా ప్రోసీడింగ్ రూపంలో శుక్రవారం ఉదయం ఆందోళన చేస్తున్న కార్మికులకు అందజేయనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, పోలీసు కమిషనర్ సిఎం.త్రివిక్రమవర్మ, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, డిసిపి ఆనందకుమార్‌రెడ్డి, రెవెన్యూ డివిజనల్ అధికారి హుసేన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు. దీనిపై కార్మిక సంఘాల నేతలు స్పందించాల్సి ఉంది.



చర్చల వివరాలను వెల్లడిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

కళ్లల్లో కారం చల్లి.. పింఛను సొమ్ము అపహరణ

వార్త మెయిన్ 3లో..

అడవిని, అటవీ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే... చట్ట సవరణలు రద్దు చేయాలి

వార్త 2లో..

రితు సాహు కేసులో పెరుగుతున్న అనుమానాలు

వార్త 3లో..



సంతకాలను సేకరిస్తున్న సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి లోకనాథం తదితరులు

అధిక ధరలపై సమరమే

సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి లోకనాథం

వార్త 5లో..

నేడు, రేపు సచివాలయాల వద్ద కరెంటు బిల్లులు దగ్ధం

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు పిలుపు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : రాష్ట్ర ప్రభుత్వం భారీగా పెంచిన కరెంటు ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబరు 1, 2 తేదీల్లో సచివాలయాల వద్ద సిపిఎం నిరసనలకు పిలుపునిచ్చిందని, ప్రజలు తమ కరెంటు బిల్లులను జెరాక్స్ తీయించి సచివాలయాల వద్ద దగ్ధం చేసి ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు కోరారు. 'నాకు అధికారమివ్వండి... విద్యుత్ ఛార్జీలు పెంచను... మాట తప్పను.. మడమ తిప్పను..' అని వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి, అధికారం చేపట్టాక మాట తప్పి, మడం తిప్పి ప్రజలపై కరెంటు ఛార్జీల భారం వేసారని, వాటికి తోడు సర్దుబాటు ఛార్జీలు, ఇంధన ఛార్జీలు, ట్రూ అప్ ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు పేరుతో ప్రజల నడ్డి విరిచే భారం వేసి వంచించారని విమర్శించారు. 2014, 2021లో వాడిన విద్యుత్‌కు నేడు సర్దుబాటు ఛార్జీలు వసూలు చేస్తున్నారన్నారు. ప్రజలపై రూ.4 వేల కోట్ల భారం వేసారని తెలిపారు. ఈ భారాలను ప్రజలు తిప్పికొట్టాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ పంపిణీ రాష్ట్రాల పరిధిలోనిదని, రాష్ట్రాల హక్కు అయిన దీనిని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తన కబంధహస్తాల్లోకి లాక్కొందని తెలిపారు. సంస్కరణల పేరుతో విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించి, తన మిత్రుడు అదానీకి సంపద పెంచే కుట్రలో మోడీ ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్ల తయారీని అదానీ కంపెనీకి కట్టబెట్టిందని తెలిపారు. రైతుల వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల బిగించమని రాష్ట్రాలపై ఒత్తిడి తెలుస్తోందని, ఈ మీటర్లు వల్ల ప్రజలు, వినియోగదారులు, రైతులపై రాబోవు కాలంలో పెనుభారాలు పడతాయని వివరించారు. విద్యుత్ తయారీకి అయ్యే మొత్తం ఖర్చును ప్రజల నుంచి వసూలుకు సిద్ధం చేస్తోందన్నారు. దళితులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఎగనామం పెడుతున్నారని తెలిపారు. మోడీ ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను, ఫెడరల్ స్ఫూర్తిని హరిస్తుంటే, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం ఎదిరించకుండా అదానీ ప్రయోజనాల కోసం కేంద్రం తెచ్చిన విద్యుత్ సంస్కరణలను రాష్ట్రంలో వేగంగా అమలు చేసి ప్రభుభక్తిని జగన్ చాటుకుంటున్నారని విమర్శించారు. ప్రజలు ఈ సంస్కరణలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులందరికీ ఉద్యోగాలివ్వాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ) : స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులందరికీ శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని, కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, పెండింగ్‌లో ఉన్న వేతన ఒప్పందాన్ని తక్షణమే అమలుచేయాలని మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం (ఎంఎన్ఎస్ఎస్) జిల్లా కన్వీనర్ ఈసర లక్ష్మి డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు గురువారం నాటికి 880వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఎంఎన్ఎస్ఎస్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈసర లక్ష్మి మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న తప్పుడు విధానాలను, పద్ధతులను వెంటనే విడనాడాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో కంటు జయమ్మ, జి.గౌరి, భూషణం, అప్పారావు, కనక తదితరులు కూర్చున్నారు.

యువగళంలో ఉరుకుటి డేవిడ్



లోకేష్‌ను కలిసిన డేవిడ్

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : యువగళం 200 కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా విశాఖపట్నం పార్లమెంటరీ నియోజవర్గ క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు ఉరుకుటి డేవిడ్ తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను ఏలూరు పార్లమెంట్ పరిధిలోగల జంగారెడ్డిగూడెం చింతలపూడి నియోజవర్గంలో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు. ఉత్తరాంధ్రలో క్రిస్టియన్ మైనార్టీ మిషనరీ సిబిఎం, సీబిసీఎన్సీ, సీబిఎల్సీ భూములు అన్యాక్రాంతంపై వివరించారు. ఈ కార్యక్రమంలో అంతోని, చిన్ని, మణికుమార్, జాషువా, యెహెూషువా, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆప్త 15 వసంతాల వేడుక

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్త) -2023 జాతీయ సమావేశాలు ఈ నెల 1 నుంచి 3వ తేదీ వరకు అమెరికాలోని అట్లాంటా నందు నిర్వహిస్తున్నట్లు ఆప్త అధ్యక్షులు కొట్టె ఉదయ్‌భాస్కర్ తెలిపారు. ఆప్త ఏర్పడి 15 సంవత్సరాలైన సందర్భంగా వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అట్లాంటా నగరంలోని గ్యాస్ సౌత్ కన్వెన్షన్‌లో మూడు రోజుల పాటు నిర్వహించే సమావేశాలకు ఆంధ్రా, తెలంగాణా రాష్ట్రాలతో పాటు వివిధ రాష్ట్రాలలో ఉన్న ఆప్తులను కన్వెన్షన్ కన్వీనర్ విజయ్ గుడిసేవ ఆహ్వానించారు. ఆప్త ఆహ్వానం మేరకు పలువురు మంత్రులు, రాజకీయ నాయకులు, పారిశ్రామిక వేత్తలు, వివిధ రంగాలలో రాణించిన ప్రముఖులు ఆప్త సభలకు హాజరుకానున్నట్లు తెలిపారు.

వైసిపి నూతన కార్యాలయంలో వైఎస్ఆర్ వర్ధంతి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : మధురవాడలో నూతనంగా నిర్మిస్తున్న వైసిపి కార్యాలయంలో ఈ నెల 2వ తేదీన కీర్తిశేషులు మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ సమన్వయకర్తలు, కార్పొరేటర్లు, కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ జిల్లా నాయకులంతా హాజరు కావాలని కోరారు.

అడవిని, అటవీ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే...

చట్ట సవరణను రద్దుచేయాలి

రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఝాన్సీ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ) : అడవిని, అటవీ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేసిన చట్ట సవరణను రద్దుచేయాలని ఎఐకెఎంకెఎస్ కో-కన్వీనర్, రైతు కూలీసంఘం ఎపి రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఝాన్సీ డిమాండ్ చేశారు. అఖిల భారత ఆదివాసీ సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ ఎఐకెఎంకెఎస్, రైతు కూలీసంఘం ఆధ్వర్యాన విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ, గత పార్లమెంట్ సమావేశాల్లో ఆదివాసీ హక్కులను, జీవితాలను, దేశ పర్యావరణాన్ని హరించే అటవీ సంరక్షణ సవరణ, జీవ వైవిధ్య సవరణ బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించిందన్నారు. ఇవి అమలైతే గిరిజన ప్రాంతంలో లక్షలాది మంది గిరిజనులు అడవి నుంచి గెంటేయబడతారన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో మైనింగ్ మాఫియాకు అడ్డూ అదుపూ లేకుండా పోతుందన్నారు. గిరిజన రైతాంగ పోరాటల ఫలితంగా గిరిజనులు సాధించుకున్న 1/70, పీసా చట్టాలు నిర్వీర్యమై పోతున్నాయన్నారు. 'గ్రామ సభల 'హక్కులు' 'మా వూరులో మా రాజ్యం' తదితరాలు ఈ చట్ట సవరణతో రద్దవుతాయని చెప్పారు. కనుక ఈ చట్ట సవరణలను రద్దు చేయాలని ఆదివాసీలు, రైతాంగం, ప్రజాతంత్ర శక్తులు పోరాడాలని పిలుపునిచ్చారు.

సెప్టెంబర్ 12, 13 తేదీల్లో ఎఐకెఎంకెఎస్ అఖిల భారత ఆదివాసీ సదస్సును విశాఖపట్నంలో నిర్వహిస్తున్నట్లు ఝాన్సీ తెలిపారు. ఈ సమావేశంలో ఎఐఎఫ్‌టియు (న్యూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు గణేష్ పండా, రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి దంతులూరి వర్మ, ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు వంజం జోగారావుదొర, రాష్ట్ర నాయకులు వివి.రమణయ్య, పి.శ్రీనివాసునాయుడు, కె.మోహన్ పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఝాన్సీ

కనకమహాలక్ష్మి ఆలయ ఈఓ శిరీషకు సన్మానం



ఇఒ శిరీషను సత్కరిస్తున్న చిల్లర వర్తక సంఘం సభ్యులు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ) : సుమారు మూడేళ్ల తరువాత శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి భక్తులు స్వయంగా అర్చనలు చేసుకునే అవకాశం కల్పించిన దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.శిరీషను బురుజుపేటలోని భక్తులతో పాటు కనకమహాలక్ష్మి చిల్లర వర్తక సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. జంధ్యాల పౌర్ణమి, రాఖీ పండుగ సందర్భంగా గురువారం దేవస్థానం కార్యాలయంలో శిరీషను సత్కరించి మిఠాయిలు తినిపించారు. ఈ శ్రావణమాసం నుంచి భక్తులు అమ్మవారిని నేరుగా దర్శించుకోవడంతోపాటు అన్ని రకాల అభిషేకాలు స్వయంగా జరుపుకునే అవకాశం కల్పించడంతో భక్తులు పెద్ద సంఖ్యలో సందర్శిస్తున్నారు. దీంతో ఆలయ పరిసరాల్లో సందడి కనిపిస్తోంది. ఈ కార్యక్రమంలో చిల్లర వర్తక సంఘం ప్రతినిధులు ఎస్.కస్తూరి, ఇ.లక్ష్మి, తులసీరత్నం, ఎస్. కనకమహాలక్ష్మి, కె.వెంకటరత్నం, కె.మహాలక్ష్మి, ఇ.కామేశ్వరి, బి.వెంకటలక్ష్మి, కె. లీలావతి, కె.కస్తూరి, ఎం.సురేష్, కొమ్మూరి సంజీవరావు, దేవస్థానం ఎఇఒ కోన.తిరుమలేశ్వరరావు, వేద పండితులు ఘనాపాటి, అర్చకులు శేషు పాల్గొన్నారు.

లైఫ్‌స్టైల్‌లో ఆటమ్ వింటర్ కలెక్షన్

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : ట్రెండ్‌సెట్టింగ్ జర్నీకి మార్గదర్శకత్వం వహిస్తూ, భారతదేశంలోని ప్రధాన ఫ్యాషన్ హబ్ లైఫ్‌స్టైల్ స్టోర్స్ తమ తాజా కలెక్షన్‌ను విడుదల చేస్తున్నట్లు ఆ సంస్థ మార్కెటింగ్ ఉపాధ్యక్షులు రోహిణి హల్దియా వెల్లడించారు. విశాఖ రామ్‌నగర్ స్టోర్‌లో క్యాంపెయిన్ లుక్‌ను క్యూరేట్ చేయడం కోసం స్టాక్‌హోమ్‌కు చెందిన స్టైలిస్ట్ నూతన ఉత్పత్తి ఆటమ్ వింటర్ కలెక్షన్‌తో అసమానమైన శైలి, అధునాతనతతో కూడిన మోడల్స్‌ను విడుదల చేసింది.

2న నీ స్నేహం కోసం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ) : ప్రముఖ గిటారిస్ట్ కన్నాజీ స్మారకార్థం శనివారం సాయంత్రం 6 గంటలకు అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నీ స్నేహం కోసం శీర్షికన సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్లు సుప్రీం ఆర్కెస్ట్రా ఇంటర్నేషనల్ లైవ్ బ్యాండ్ అధినేత డాక్టర్ సుప్రీం శేఖర్ తెలిపారు. గురువారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా సుప్రీం శేఖర్ మాట్లాడుతూ, ఈ సినీ సంగీత విభావరిలో ప్రముఖ గాయకులు డేవిడ్, నందిత, రాజేంద్ర ప్రసాద్, రమేష్ పట్నాయక్ సునీత, అబిద్ అలీ తదితరులు తెలుగు, హిందీ చిత్ర గీతాలు ఆలపిస్తారని చెప్పారు. ఈ సమావేశంలో చెన్నా తిరుమలరావు, కె.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



డిప్యూటీ మేయర్ శ్రీధర్‌కు రాఖీ కడుతున్న మేయర్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, వైసిపి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావుకు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి రాఖీ కట్టి తన సోదర భావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సోదరీసోదరుల మధ్య ప్రేమాను రాగాల బంధాన్ని దృఢపరిచేదే రాఖీ పండుగ అన్నారు.

వేపగుంట : రాఖీ పౌర్ణమి సందర్భంగా జివిఎంసి కార్యాలయంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌కు మేయర్ గొలగాని హరివెంకటకుమారి రాఖీ కట్టి ఆశీర్వచనం తీసుకున్నారు. అనంతరం పలువురు బ్రహ్మ కుమారీలు కూడా డిప్యూటీ మేయర్ శ్రీధర్‌కురాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

.పద్మనాభం: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం రాఖీ పండగ నిర్వహించారు. మద్ది గ్రామంలో ఎంపిపి కంటుభుక్తు రాంబాబు నివాసం వద్ద అతని తోబుట్టువులు వచ్చి రాఖీ కట్టారు. సోదర అభిమానాన్ని చాటారు. మిఠాయిలు తినిపించారు.

దేవరాపల్లి :అక్కా తమ్ముళ్ళ, అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ అని తెనుగుపూడి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారావు అన్నారు. కళాశాల ఆవరణలో గురువారం రాఖీ పౌర్ణమి సందర్భంగా పాఠశాల/కళాశాలలోవిద్యార్థులకు వారి సోదరీమణులు వచ్చి రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. దీంతో కళాశాల ఆవరణలో పండగ వాతావరణం నెలకొంది.

కె.కోటపాడు : మండలంలోని అన్ని గ్రామాలలో రక్షాబంధ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అక్క చెల్లెలు తమ పుట్టినింటికి వచ్చి అన్నదమ్ములకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించి, అన్నదమ్ములు ఇచ్చిన కానుకలను స్వీకరించారు. గ్రామాలలో రాఖీ సందడి కనిపించింది. .

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది పరిసర ప్రాంతాల్లో రక్షాబంధన్ వేడుకలు ఇంటింటా సందడిగా జరిగాయి. ఎక్కడెక్కడో సుదూర ప్రాంతాలలో స్థిరపడినవారు, వలస పోయినవారు తమ స్వగ్రామాలకు చేరుకుని అన్నదమ్ములకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లో రాఖీ సందడి కొనసాగుతోంది. గురువారం తెల్లవారుజాము నుండి రాఖీ, ఫ్యాన్సీ, స్వీట్స్ స్టాల్స్ దుఖాణాల వద్ద కొనుగోలుదారులతో సందడిగా కనిపించాయి.



ఎంపిపి వాసురాజుకు రాఖీ కడుతున్న సర్పంచ్‌ఛాయా గౌతమి

భీమునిపట్నం : సోదర ప్రేమకు ప్రతీకగా నిలిచే రక్షబంధన్ వేడుకలను గురువారం పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి దంతులూరి వెంకటశివ సూర్య నారాయణ రాజుకు, టి నగరపాలెం సర్పంచ్ పోట్నూరు చాయా గౌతమి తదితరులు రాఖీ కట్టి శుభాకాం క్షలు తెలిపారు. దాకమర్రి ఎంపిటిసి చెల్లూరి నగేష్‌బాబుకు రాఖీ కట్టారు.

బుచ్చయ్యపేట : మండలంలోని గ్రామాల్లో రక్షాబంధన్ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. అన్నదమ్ములకు అక్క చెల్లెలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. అన్నదమ్ములు తమ తమ స్థాయిను బట్టి బహుమతులను అందజేశారు.

ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్-తెలుగు నిఘంటువు విడుదల

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఏటా ఆగస్టు 29న ఆక్స్ ఫర్డ్ యూనివర్శిటీ ప్రెస్ ద్విభాషా ఇంగ్లీష్-ఇంగ్లీష్-తెలుగు నిఘంటువు కొత్త ఎడిషన్‌ను ఆవిష్కరిస్తున్నట్లు ఆక్స్ ఫర్డ్ ప్రెస్ ఇండియా హెడ్ సుమంత్ దత్తా అన్నారు. గురువారం సిరిపురంలోని వుడా చిల్డ్రన్ ఏరినలో జరిగిన కార్యక్రమంలో ఈ కొత్త ఎడిషన్‌ను ప్రారంభించారు. ఈ నూతన ఎడిషన్‌లో 3,000 కొత్త పదాలను చేర్చి, ఆక్స్ ఫర్డ్ కాంపాక్ట్‌ను అందుబాటులోకి తెచ్చిందని సుమంత్ దత్తా తెలిపారు. ఇంగ్లీష్-ఇంగ్లీష్-తెలుగు డిక్షనరీ 27,000పైగా పదాలు, పదబంధాలు, సామెతలు లాంటి వాటిని తెలుగులో వాటి వివరణాత్మక అనువాదాలను కలిగి ఉన్నాయి. ఇది 1,100 కంటే ఎక్కువ పర్యాయపదాలు, వ్యతిరేక పదాలను కలిగి ఉందని వివరించారు. ఆంగ్లంలో తెలుసు కోవలసిన అత్యంత ముఖ్యమైన 2,000 కీలకపదాలు ఉన్నాయని తెలిపారు.

రితు సాహు కేసులో పెరుగుతున్న అనుమానాలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖపట్నంలో మృతి చెందిన బెంగాల్ విద్యార్థిని రితు సాహు కేసులో కొత్త ట్విస్ట్ నెలకొంది. ఘటన జరిగిన 15 రోజుల తర్వాత ఈ కేసును అనుమానస్పద మృతిగా పోలీసులు మార్చారు.ఈ కేసులోకి బెంగాల్ పోలీసులు విచారణ చేపట్టాక మొత్తం కేసు మారిపోయింది. ఆంధ్రా పోలీసులపై నమ్మకం లేదంటూ విద్యార్థిని తల్లిదండ్రులు ఫిర్యాదుతో ఈ కేసును సీరియస్‌గా తీసుకోవాలని పోలీసులకు బెంగాల్ సిఎంమమతా బెనర్జీ ఆదేశాలు జారీ చేశారు. కోల్‌కతాలోని నేతాజీ నగర్ పోలీస్ స్టేషన్‌లో విశాఖలో విద్యార్థిని హత్యకు గురైనట్లు గతంలో సెక్షన్ 302 కింద కేసు నమోదైంది. ఫోర్త్ టౌన్ పోలీసులు కేసు విచారణలో అనేక లోపాలున్నాయని బెంగాల్ సిఐడి గుర్తించారు. కోర్టు ఆదేశాల మేరకు ఫోర్త్ టౌన్ పోలీసులు వెస్ట్ బెంగాల్ సిఐడి అధికారులకు సహకరిస్తున్నారు.

అనుమానాస్పద మృతిగా నమోదు

విచారణలో భాగంగా విశాఖకు చేరుకున్న బెంగాల్ సిఐడి పోలీసులు హత్యా కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. హాస్టల్ యాజమాన్యం, బైజుస్ ఆకాశ్ సంస్థ, వైద్యం అందించిన ఆసుపత్రి డాక్టర్ల నిర్లక్ష్యం, వారి పాత్రపై విచారణ మొదలు పెట్టారు. అనంతరం ఓ నిర్ధారణకు వచ్చాక గురువారం రితు సాహు మృతిపై సెక్షన్ 174 నుంచి ఐపిసి 304 పార్ట్ 2గా మార్చారు. ఫోరెన్సిక్ రిపోర్ట్ కోసం ఎదురుచూస్తున్నారు. రిపోర్టు ఆధారంగా తదుపరి దర్యాప్తు కొనసాగనుంది. ఇన్ని రోజులు రితు సాహుది ఆత్మహత్యగా భావించిన విశాఖ పోలీసులు అనుమానస్పద మృతిగా సెక్షన్ 174 ఐపిసి కింద కేసు నమోదు చేశారు. కాలేజీ, హాస్టల్ యాజమాన్యం నిర్లక్ష్యాన్ని విచారణలో పోలీసులు గుర్తించారు. రెండో రోజు దర్యాప్తులోసాధన హాస్టల్, వెంకటరమణ హాస్పిటల్‌లో సీసీ కెమెరాలు, రికార్డులు పరిశీలించారు.

పలు అనుమానాలు

విద్యార్థిని రితు సాహు ఆస్పత్రిలో ఉన్న వీడియో ఒకటి వెలుగులోకి వచ్చింది. హాస్టల్ బిల్డింగ్ పైనుంచి కింద పడిన తర్వాత ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించింది బైజూస్ యాజమాన్యం. విద్యార్థిని శరీరంపై బలమైన గాయాలు ఏమీ కనిపించలేదు. బలమైన గాయాలు లేకపోవడం, మృతికి దారి తీసిన కారణాలపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ట్రీట్‌మెంట్ చేస్తున్న సమయంలో వైద్యులకు సహకరించకుండా రితు అడ్డుకోవడం కనిపించింది.

యువగళానికి సంఘీభావంగా పాదయాత్ర



గోపాలపట్నంలో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి -గోపాలపట్నం : తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం యువగళం పాదయాత్రకు సంఘీభావంగా పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.గణబాబు ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు ర్యాలీ నిర్వహించాయి. బిఆర్‌టిఎస్ రోడ్డులో గోపాలపట్నం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్‌కు గణబాబు శుభాకాంక్షలు తెలిపారు. యువగళం పాదయాత్ర విజయవంతంగా పూర్తి చేయాలని ఆకాంక్షించారు.

సబ్బవరం :టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తలపెట్టిన యువగళం పాదయాత్రకు 200 రోజులు పూర్తయిన సందర్భంగా మండల కేంద్రంలోని దుర్గమాంబ ఆలయం నుండి జోడుగుళ్ళు వరకు మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో గురువారం సంఘీభావ పాదయాత్ర నిర్వహించారు. ఈ టిడిపి నాయకులు గండి రవికుమార్, మిడతాడ మహాలక్ష్మి నాయుడు, బర్లికాన బాబురావు, పిబివిఎస్ఎన్ రాజు, కోటాన అప్పారావు, రెడ్డి నారాయణరావు, గండి ముత్యాల నాయుడు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

కశింకోట : లోకేష్ పాదయాత్ర 200 రోజులు పూర్తయిన సందర్భంగా అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆధ్వర్యాన గురువారం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గొంతిని శ్రీనివాసరావు, సిద్ధిరెడ్డి శ్రీనివాసరావు, బిఎస్ఎమ్‌కె. జోగినాయుడు, మాజీ ఎంపీపీ కొణతల శ్రీనివాసరావు మాజీ సర్పంచ్ కర్రి దుర్గ నాయుడు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : యువగళం పాదయాత్ర 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం జిల్లా టిడిపి కార్యాలయం నుంచి దక్షిణ నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి గండి బాబ్జీ సారధ్యంలో నాయకులు, పంది మెట్ట మీదుగా బీచ్ రోడ్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వరకు పాదయాత్ర నిర్వహించారు.

ఆరిలోవ : లోకేష్ యువగళం మహా పాదయాత్ర గురువారం నాటికి 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని తూర్పు నియోజకవర్గం టిడిపి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం సంఘీభావ పాదయాత్ర నిర్వహించారు. బిఆర్‌టిఎస్ రోడ్డు హనుమంతువాక నుంచి దీనదయాల్‌పురం వరకు నిర్వహించిన పాదయాత్రలో తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, టిడిపి నాయకులు మద్దిల రామలక్ష్మీ రాజశేఖర్, బుడుమూరు గోవిందు, ఒమ్మి అప్పలరాజు, ఒమ్మి పోలారావు, గాడి సత్యం, ముగడ రాజారావు, ఏడువాక సన్యాసిరావు, గాడు అప్పలనాయుడు, బాలస్వామి పాల్గొన్నారు.



ఆరిలోవలో టిడిపి సంఘీభావ పాదయాత్రలో ఎమ్మెల్యే వెలగపూడి

నేరాలు ఘోరాలు

వివాహితపై హత్యాయత్నం కేసులో భర్త, అత్తకు రిమాండ్

ప్రజాశక్తి - ఆరిలోవ : భార్యపై విచక్షణారహితంగా కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన భర్తను, అతనికి సహకరించిన తల్లిని ఆరిలోవ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. ఆరిలోవ సిఐ సోమశేఖర్ తెలిపిన వివరాలివి.

నగరంలోని పూర్ణామార్కెట్‌కు చెందిన వాసుపల్లి ప్రసాదుకు, ఆరిలోవ ప్రాంతానికి చెందిన నీలమతో వివాహం అయ్యింది. కొంతకాలంగా అనుమానంతో భార్య నీలిమను ప్రసాద్ వేధిస్తున్నాడు. దీంతో భర్తతో గొడవ పడి, కొన్నాళ్లుగా ఆరిలోవలోని తన కన్నవారింటిలో నీలిమ ఉంటుంది. బుధవారం నీలిమ భర్త ప్రసాదు, అత్త వాసుపల్లి ముత్యాలమ్మ ఆరిలోవలో ఉంటున్న కోడలు ఇంటికి వచ్చారు. తల్లి సమక్షంలోనే భార్య నీలిమపై ప్రసాద్ బ్లేడుతో దాడి చేసి పరారయ్యాడు. దీనితో నీలిమకు ముఖంపైనా, మెడపై తీవ్రగాయాలయ్యాయి. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. నీలిమ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సిఐ సోమశేఖర్ కేసు నమోదు చేశారు. పరారీలోనున్న నీలిమ భర్త ప్రసాద్, అత్త ముత్యాలమ్మను బుధవారం అదుపులోకి తీసుకొని గురువారం రిమాండుకు తరలించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరి జైలుశిక్ష

ప్రజాశక్తి-సీతమ్మధార: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికీ జైలు శిక్ష పడినట్లు నాలుగో పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ వాణిశ్రీ తెలిపారు నాలుగోపట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ పోలీసులు పలుచోట్ల విస్తృతంగా నిర్వహిస్తున్న తనిఖీల్లో మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడిన గౌరీనాయుడు అనే వ్యక్తికి ఎనిమిది రోజులు, విఘ్నేష్‌కు ఏడు రోజుల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పుచెప్పారన్నారు.మిగతా కేసుల్లో పలువురికి రూ.1.22లక్షల జరిమానా విధించారన్నారు.

యువతి అదృశ్యం



అదృశ్యమైన గౌతమి

ప్రజాశక్తి -మధురవాడ: పి.ఎం.పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో యువతి అదృశ్యంపై వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ వై.రామకృష్ణ తెలిపారు.సిఐ తెలిపిన వివరాల మేరకు, ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న కొమ్మాది జయంతినగర్‌కు చెందిన యువతి గౌతమి (17) ఈ నెల 28న కళాశాలకు వెళ్లింది. సాయింత్రం ఇంటికి రాకపోవడంతో స్నేహితులు, బంధువులు ఇళ్లల్లో ఆచూకీ తీశారు. మిత్రులతో కలిసి కొమ్మాది కూడలిలోని థియేటర్‌లో సినిమా చూసేందుకు వెళ్లినట్లు తెలిసిందని, తర్వాత కనిపించకుండా పోయిందని యువతి తల్లి జయ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ శ్యాంప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని సిఐ రామకృష్ణ తెలిపారు.

భెల్ ఎన్నికల్లో యునైటెడ్ ఫ్రంట్ గెలుపు

ప్రజాశక్తి -గాజువాక : భెల్ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో యునైటెడ్ ఫ్రంట్ గెలిచింది. ప్రోగ్రెసివ్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్ మధ్య హోరాహోరీగా సాగిన పోరులో చివరి నిమిషంలో 28 ఓట్ల తేడాతో యునైటెడ్ ఫ్రంట్ గెలిచింది. 445 ఓట్లకు గాను, 441 ఓట్లు పోలవ్వగా, నలుగురు ఓటింగ్‌లో పాల్గొనలేదు. లెక్కింపులో మూడు ఓట్లు చెల్లకపోగా, ప్రోగ్రెసివ్ ఫ్రంట్‌కు 197ఓట్లు రాగా, యునైటెడ్ ఫ్రంట్‌కు 225, బిఎంఎస్‌కు 16 ఓట్లు వచ్చాయి.

కార్మికులను మభ్యపెట్టి గెలుపు

భెల్ ఎన్నికల్లో కార్మికులను మభ్యపెట్టి యునైటెడ్ ఫ్రంట్ గెలిచిందని, యాజమాన్యంతో మాట్లాడే సమర్థత ఈ యూనియన్‌లో ఎవరికీ లేదని, ప్రోగ్రెసివ్ ఫ్రంట్ అధ్యక్షుడు జెటివి. ప్రకాశ్ అన్నారు. యూనియన్ పనితీరుపై సరైన అవగాహన లేని కొద్దిమంది కొత్త ఓటర్లు తప్ప కార్మికులంతా ప్రోగ్రెసివ్ ఫ్రంట్‌కు ఓట్లేశారన్నారు. భెల్ గుర్తింపు సంఘం ఎన్నికల్లో 48శాతం ఓట్లు ప్రోగ్రెసివ్ ఫ్రంట్‌కు పడ్డాయన్నారు.

మేనిఫెస్టో అమలుకు కృషి

ఓటమి చెందినా నైరాశ్యం చెందకుండా కార్మికుల సమస్యలపై పోరాటం కొనసాగుతుందని జెటివి ప్రకాష్ స్పష్టం చేశారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో ప్రకటించిన మేనిఫెస్టో అమలుకు యాజమాన్యంతో పోరాడి సాధించుకుందామన్నారు. కార్మికుల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి ఐక్యతతో ముందుకు సాగి, కార్మిక వాణిని వినిపిద్దామని జెటివి ప్రకాష్ తెలిపారు.

సన్‌ఫార్మా ఇంటర్న్‌షిప్, ఉద్యోగాల్లో గీతం విద్యార్థులకు ప్రాధాన్యత

గీతంలో సన్‌ఫార్మా గ్లోబల్ హెడ్ సందర్శన



సన్‌ఫార్మా గ్లోబల్ హెడ్‌ను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయ విద్యార్థులకు తమ ఔషధ సంస్థలో ఇంటర్న్‌షిప్‌లతో పాటు వివిధ విభాగాలలో ఉద్యోగావకాశాలపై ప్రాధాన్యత ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని ప్రముఖ ఔషధ తయారీ సంస్థలలో ఒకటైన సన్ ఫార్మా రీసెర్చి సెంటర్ గ్లోబల్‌హెడ్ డాక్టర్ పల్లె వెంకట అన్నారు. గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. విశ్వవిద్యాలయం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్, వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం, సైన్స్ కోర్సుల డీన్ ప్రొఫెసర్ కృష్ణ, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ డైరక్టర్ ప్రొఫెసర్ జివిఆర్.శర్మ, రసాయన శాస్త్రవిభాగం అధిపతి డాక్టర్ బి.శ్రీనివాసరావులతో సమావేశమయ్యారు. అనంతరం గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయనశాస్త్ర విభాగం పరిశోధకులు, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఔషధ పరిశోధనలలో వస్తున్న మార్పులు, నూతన ఔషధాల అన్వేషణలో కొత్త పద్దతులను వివరించారు. గీతంలో పరిశోధనలను, ప్రయోగశాలల ఆధునికీకరణను వైస్‌ఛాన్సలర్ వివరించారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని మద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం ప్రశాంతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు టి యర్రయ్య తెలుగు భాష ఔన్నత్యాన్ని, గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. మాతృభాష పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు.

గ్లోబల్ ఫిన్‌టెక్, సైబర్ సెక్యూరిటీ కౌన్సిళ్లలో కెఎల్ వర్సిటీకి సభ్యత్వం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఎంబిఎ ఫిన్‌టెక్ ప్రోగ్రామ్‌కు ఫిన్‌టెక్ కౌన్సిల్, సైబర్ క్రైమ్ ఇంటర్నేషనల్ ఇన్వెస్టిగేషన్ కౌన్సిల్ రెండింటిలోనూ కెఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ తాత్కాలిక సభ్యత్వం పొందినట్లు వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు ఆర్థిక సాంకేతికత, సైబర్ సెక్యూరిటీ రంగాలలో ఆవిష్కరణ, సహకారం శ్రేష్టతను పెంపొందించడంలో విశ్వవిద్యాలయం నిబద్ధతకు నిదర్శనం అని పేర్కొన్నారు.

వైఎస్‌ఆర్ బీమా తక్షణసాయం అందజేత



బీమా పరిహారంఅందజేస్తున్న కార్పొరేటర్

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి, నాలుగోవార్డు పాత పరదేశిపాలెంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పి అప్పారావు కుటుంబానికి వైఎస్ఆర్ బీమా తక్షణసాయం కింద రూ.10వేలు పరిహారాన్ని స్థానిక కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు గురువారం అందజేశారు. మృతుని భార్య, నామినీ కుమారికి నగదును అందజేశారు. బీమా పరిహారం కింద మరో రూ.90వేలను నామినీ బ్యాంకు ఖాతాలో జమ చేస్తారన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది, స్థానిక వైసిపి నేతలు రమణ, గురుమూర్తి, గోపాల్ రెడ్డి పాల్గొన్నారు

సమాజంలో చెడును ప్రశ్నించాలి

న్యాయం జరగని చట్టాలపై నమ్మకం పోతోంది! : మాజీ ఎంపీ ఉండవల్లి

ప్రజాశక్తి-సీతమ్మధార : సమాజంలో జరుగుతున్న చెడును ప్రతిఒక్కరూ ప్రశ్నించాలని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. కోర్టులో గానీ, స్టేషన్‌లో గానీ బాధితులకు ఎక్కడా న్యాయం జరగడం లేదన్నారు.న్యాయం లేని చట్టాలపై నమ్మకం లేని రోజులు ప్రస్తుతం నడుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పౌరగ్రంథాలయంలో సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ న్యాయం కోసం బాధితులు కోర్టుకెళ్లాలన్నా భయపడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఓట్లు కోసం రాజకీయాలు చేస్తున్నారే తప్ప, ప్రజలకు మంచి పాలన అందించే మంచి నాయకుడు లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. ఒకప్పుడు రాజకీయాలంటే, సొంత ఆస్తులను ఖర్చు చేసేవారని, ఇపుడు ఖర్చుచేసిన దానికి ఎన్నింతలు సంపాదించాలనే ఉద్దేశంతో రాజకీయాలు చేస్తున్నారన్నారు. అలాగని చట్టాలు, న్యాయంపై నమ్మకం పోవడం సరికాదని, చెడును ప్రశ్నిస్తే, ఎక్కడో ఒక దగ్గర తప్పక న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ ప్రతినిధులు ప్రసన్నకుమార్ మధుకుమార్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ



ఉండవల్లిని సత్కరిస్తున్న నిర్వాహకులు

కృష్ణా గ్రామర్ స్కూల్ విద్యార్థుల ఔదార్యం

చైల్డ్ హెల్ప్ ఫౌండేషన్‌కు రూ.2.44లక్షల వితరణ



నగదు సాయం చెక్కును అందజేస్తున్న సిఐ

ప్రజాశక్తి - ఆరిలోవ :ఆరిలోవ ప్రాంతంలోని చైల్డ్ హెల్ప్ ఫౌండేషన్‌కు ఆదర్శనగర్ శ్రీకృష్ణా గ్రామర్ స్కూలు విద్యార్థులు రూ.2.44 లక్షల వితరణ అందించారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆరిలోవ సిఐ సోమశేఖర్ పాల్గొని చైల్డ్ హెల్ప్ ఫౌండేషన్ విశాఖపట్నం ఇన్‌చార్జ్ సూర్య లక్ష్మీకి విద్యార్థులు సేకరించిన రూ.2,44,552ల చెక్కును అందజేసారు. ఈ సందర్భంగా సిఐ సోమశేఖర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి సేవాభావాన్ని అలవాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. విద్యార్థుల్లో సేవాభావాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్న పాఠశాల అధినేత మునికృష్ణ, ప్రిన్సిపాల్ విజయ భాస్కర్, ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాల అధినేత మునికృష్ణ మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు సమకూర్చిన నగదును పేద పిల్లల చదువుకు వినియోగించాలని కోరారు. చైల్డ్‌హెల్ప్ ఫౌండేషన్ ఇన్‌చార్జ్ సూర్యలక్ష్మీ మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో ఉదారంతో ఇచ్చిన ప్రతిపైసాను సేవా కార్యక్రమాలకు ఉపయోగిస్తామన్నారు.

భవిత కేంద్రం నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 87వ వార్డు, వడ్లపూడిలో ప్రత్యేక అవసరాల గల పిల్లల పాఠశాల (భవిత కేంద్రం) నూతన భవనం నిర్మాణ పనులను సమగ్ర శిక్షణ ప్రాజెక్టు ఆఫీసర్ బి శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. పిల్లల ఫిజియోథెరఫీకి అభయం ఫౌండేషన్, స్పందన చేయూత ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యా దీన్ని నిర్మిస్తున్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లల శ్రేయస్సును కోరి దాతలు ముందుకు రావడం అభినందనీయం అన్నారు. సామాజిక సేవే లక్ష్యంగా పనిచేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులను అభినందించారు. ఇందులో హాలుతో పాటు ఫిజియోథెరఫీ సామాన్లు అమర్చడం, హైడ్రో థెరఫీ, సాండ్ థెరఫీ, పార్కు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఫౌండేషన్ ప్రతినిధులు రవి కలిడింది, ఈపూరి బుచ్చిరాజు సంస్థ తరపున చేస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో రాజన్ రాజు, సీతారామరాజు, సమగ్ర శిక్ష అభియాన్ ఐఇ కోఆర్డినేటర్ అబ్దుల్లా ఆషా, ఎంఇఒలు విశ్వనాధ్, సునీత, శ్రీనివాసరాజు, శివాజీ, చిన బుచ్చిరాజు, విజయ భాస్కర్, మూర్తి, ఆనంద్, జగదేవ్, మురళీధర్ రెడ్డి, ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు



పనులను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

గణనీయంగా తగ్గిన ఖరీఫ్ సాగు విస్తీర్ణం

60శాతానికి తగ్గిపోయిన వరి సాగు
వర్షాభావ పరిస్థితులే కారణం
వ్యవసాయశాఖ జెడి అప్పలస్వామి

ప్రజాశక్తి -మధురవాడ : ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల్లో విశాఖపట్నం జిల్లాలో ప్రధాన వరిపంటతోపాటు ఇతర పైర్ల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. దీనిపై జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ అప్పలస్వామి తెలిపిన వివరాలివి.

ఏటా ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 5575 హెకార్లు సాధారణ సాగువిస్తీర్ణం కాగా ఈ ఏడాది ఇప్పటివరకు 3155 హెక్టార్లలో సాగుబడిలోకి వచ్చింది. అందులో 4599 హెకార్లలో వరిసాగుకు గాను 2751 హెక్టర్లలో నాట్లు పడ్డాయి. 60 శాతం వరిసాగు నమోదైంది. సజ్జలు 71 హెక్టార్లకుగాను 37 హెక్టార్ల (52శాతం)లో వేరుశనగ 112 హెక్టర్లకు గాను 23 హెక్టార్ల(20.5శాతం)లో నువ్వులు 544హెక్టార్లకు గానున 324 హెక్టార్లు (60శాతం)లో సాగు చేసినట్లు తెలిపారు మండలంలో ఇంకా 2420ఎకరాల పంటభూమి వర్షాభావం, ఇతరత్రా పరిస్థితుల కారణంగా సాగుకు దూరంగా ఉందన్నారు.

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో.జిల్లాలో 2194 క్వింటాళ్ల వరి విత్తనాలు, 125.28 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు, 34.6 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను రాయితీపై రైతులకు పంపిణీ చేశామన్నారు. 1094 టన్నుల వివిధ రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిలో యూరియా 646 మెట్రిక్ టన్నులు, డిఎపి 392 మెట్రిక్ టన్నులు, పొటాష్ 54 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 91 మెట్రిక్ టన్నులు, సింగల్ సూపర్ ఫాస్పెట్ 111 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందన్నారు..రైతు భరోసా కేంద్రాలలో యూరియా 180 మెట్రిక్ టన్నులు, డిఎపి 108 మెటిక్ర్ టన్నులు సరఫరా చేసినట్లు తెలిపారు.

మజ్జివలసలో పొలంబడి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎడిఎ విజయప్రసాద్

ప్రజాశక్తి -తగరపువలస:భీమిలి మండలం మజ్జివలసలో మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గురువారం పొలంబడి నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బొడ్డేపల్లి విజయప్రసాద్ పాల్గొని, రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వరి సాగులో యాజమాన్య పద్ధతులు గురించి వివరిస్తూ, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధన, పొలం పరిసరాల విశ్లేషణ, మిత్ర పురుగుల సంరక్షణ, వరి పంటలో కలుపునివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. వ్యవసాయ డ్రోన్లు, నానో యూరియా ఉపయోగాలను వివరించారు. వరి పొలం గట్లుపై బంతి లేదా కందులు వంటి ఎర పంటులు వేయడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజెప్పారు. 100 శాతం రాయితీతో రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉండే కంది విత్తనాలను వరి పొలం గట్లుపై రైతుల ఎరపంటగా వేయాలని సూచించారు. వరి పొలాల్లో తూర్పు, పడమర దిశగా కాలి బాటలు వేయాలని సూచించారు.మండల వ్యవసాయాధికారి బి శివకోమలి, విఎఎ బి.రమేష్ పాల్గొన్నారు.

వైభవంగా నాగబంధం ప్రతిష్ట

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డు సీతమ్మపేట గ్రామదేవత (మూడు గుళ్ల దేవాలయం) కనకమాంబ ప్రాంగణంలోని రావి,వేప చెట్ల వద్ద పండితులు శివగణేష్ శర్మ ఆధ్వర్యంలో మోకర వెంకటరావు దంపతులతో నాగ బంధం విగ్రహ ప్రతిష్ట వైభవంగా జరిగింది. స్థానిక కార్పొరేటర్, జివిఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యులు సారిపిల్లి గోవింద్ పాల్గొని విగ్రహానికి పాలాభిషేకం, పంచామతాభిషేకం, అన్నాభిషేకం చేసారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు సారిపిల్లి గంగరాజు, బోరా వెంకట రమణ, నమ్మి వెంకట్, ముvvల రాజారావు, ముvvల పాపారావు, ఈసారపు అప్పారావు, సానబోయిన సురేష్, వారధి యర్రాజీ, బోరా గోవింద్, బోర శ్రీను, వారధి శ్రీను, సారిపిల్లి సంతోష్, సారిపిల్లి వెంకట రమణ, వియ్యపు సంతోష్, కేత గంగరాజు, సత్తి సోమయ్య, దాసరి కనకారావు, ఆవాల వెంకట్, ఒమ్మి ఆనంద్, చంటి, బీసపు శ్రీను, నల్ల చిన్న, స్వర్ణపూడి సత్యనారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 92వ వార్డు ఇందిరానగర్‌లో రూ.34 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, జివిఎంసి కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు గురువారం శంకుస్థాపన చేశారు. అప్పాజీ టవర్స్ వద్ద సిసి రోడ్లు, డ్రైనేజీ మరమ్మతులు రిపేర్లు, ప్యాచ్ వర్క్స్, అలాగే బాలాజీ నగర్‌లో సామాజిక భవనం మొదటి అంతస్తు నిర్మాణం, సిసి రోడ్లు, డ్రెనేజీ నిర్మాణం వంటి పనులను చేపట్టనున్నారు.. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధి, ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పక్షవాతంలో బాధపడుతున్న ఒక వ్యక్తికి తన సొంత నిధులతో ప్రతినెలా పింఛను అందిస్తామన్నారు.

ఈ సందర్భంగా నేతలిద్దరికీ స్థానిక మహిళలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, డిఇ విజయ్ కుమార్, ఎఇ. వెంకటలక్ష్మి, వైసిపి వార్డు అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, జి అప్పలస్వామి నాయుడు, గేదెల మురళీకృష్ణ, బురెడ్డి గోపి, కంపర కోటేశ్వరరావు, ఊటపల్లి గోవిందు, కొమనాపల్లి త్రినాధ్, మార్కండేయ రాజశేఖర్, ధర్మ, కామేష్, వెంకటరావు, జీవి రమణ, అర్జున్ రావు, దేరెడ్ల సత్యనారాయణ రెడ్డి, కిషోర్, కోనేటి శ్రీను, భాను, లతీఫ్, కోటి, ప్రకాష్, తుంపాల శ్రీను, బలిరెడ్డి శ్రీను, కుమార్, వాసు, నాగేశ్వరరావు, సుబ్బారావు, ఇల్లపు రమణ, ఆచారి, సురేష్, కేబుల్ శేఖర్, రేణుక పాల్గొన్నారు

అధిక ధరలపై సమరమే

సంతకాల సేకరణలో సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి లోకనాథం



సంతకాలు సేకరణ చేస్తున్న సిపిఎం అచ్యుతాపురం నాయకులు



కె.కోటపాడు మండలం ఎ.కోడూరులో..



సింహాచలంలో...

ప్రజాశక్తి- అనకాపల్లి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల పెరుగుతున్న అన్ని రకాల ధరలపై సిపిఎం సమరభేరి మోగించినట్లు సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అన్నారు. అధిక ధరలు, నిరుద్యోగం, విద్యుత్ భారాలపై గురువారం అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సిపిఎం నాయకులు సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ట్రూఅప్, ఫ్యూయల్ సర్‌ఛార్జి పేరుతో ఎప్పుడో వాడుకున్న విద్యుత్‌కు ఇప్పుడు భారాలు వేయడం దారుణమన్నారు. మోడీ ప్రభుత్వం రూ.450 ఉన్న గ్యాస్ ధరను రూ.1200 చేసిందని, పెట్రోల్, డీజిల్ ధరలు అడ్డూ అదుపు లేకుండా పెంచుతుందని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు 40శాతం వరకు పెరిగాయన్నారు. యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ఎ.బాలకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు, అల్లు రాజు, నాయకులు కె.ఈశ్వరరావు, సిహెచ్ శివాజీ, బి నూకప్పారావు, ఎస్ నాగ రమణ, తరుణ్ పాల్గొన్నారు.

కశింకోట : సమరభేరి కార్యక్రమంలో భాగంగా సిపిఎం నాయకులు కశింకోటలో ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి వారి నుండి సంతకాల సేకరణ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు దాకారపు శ్రీనివాసరావు, తాతబ్బాయి, వెంకటరావు, వై లక్ష్మి, నాగేశ్వరావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై మండలంలో హరిపాలెం, భోగాపురం గ్రామాలలో సిపిఎం నాయకులు సంతకాలు సేకరణ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆర్.రాము, బి.రామ్‌కుమార్, కె.సోమునాయుడు, కర్రి అప్పారావు, కె.రామ సదాశివరావు, కన్నుము నాయుడు, బుద్ద రంగారావు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని ఎ.కోడూరు గ్రామంలో బస్టాండ్ వద్ద, యాతపేట, ఎస్సీ కాలనీలో గురువారం సిపిఎం నాయకులు సమావేశాలు ఏర్పాటు చేసి అధిక ధరలు, నిరుద్యోగం, విద్యుత్ భారాలకు గల కారణాలను ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా సంతకాలు సేకరణ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గండి నాయన బాబు, వనము సూర్యనారాయణ, పార్టీ సానుభూతిపరులు పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : మండలంలోని తోటాడ గ్రామంలో గురువారం అధిక ధరలు, విద్యుత్ చార్జీలు, నిరుద్యోగ సమస్యలపై సిపిఎం నాయకులు కరపత్ర ప్రచారం చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వివి.శ్రీనివాసరావు, నాయకులు పెంటకోట జోగినాయుడు, కాండ్రేగుల రాము పాల్గొన్నారు.

తగరపువలస : ధరాభారం, నిరుద్యోగితపై సిపిఎం భీమిలి జోన్ కార్యదర్శి రవ్వ నరసింగరావు ఆధ్వర్యంలో గురు వారం 1,2 వార్డుల్లోని బాలాజీ నగర్, బైపాస్ రోడ్డు, గ్రంధాలయం వీధి ప్రాంతాల్లో సిఐటియు నాయకుల తో కలిసి సంతకాల సేకరణ చేపట్టారు.యూనియన్ నాయకులు జోగ వెంకటరావు, రీసు నరసింగరావు, ఆకాష్ పాల్గొన్నారు.

అధిక ధరలు, నిరుద్యోగం, విద్యుత్ భారాలపై సిపిఎం సమరభేరిలో భాగంగా తగరపువలస సిఐటియు కార్యాలయంలో గురువారం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ భీమిలి జోన్ అధ్యక్ష,కార్యదర్శులు ఆర్ఎస్ఎన్ మూర్తి, రవ్వ నరసింగరావు , సిఐటియు నాయకులు నీలాతి రాము, వెంకటరావు, నాగరాజు పాల్గొన్నారు.

మధురవాడ : కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలు, ధరాభారంపై సిపిఎం మధురవాడ జోన్ కమిటీ ఆధ్వర్యంలో కొమ్మాది కూడలి, వికలాంగుల కాలనీ వద్ద, శారదా నగర్, మిథిలాపురి వుడా కాలని ప్రాంతాలలో సంతకాల సేకరణ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు డి అప్పలరాజు, పి రాజుకుమార్ జి కిరణ్,బి నాగేశ్వరరావు, అర్ గణేష్, కె.సత్యనారాయణ, సి హెచ్ శ్రీను పాల్గొన్నారు.

సింహాచలం : పెంచిన విద్యుత్ ఛార్జీలు, నిరుద్యోగం. ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా సింహాచలం మార్కెట్ ఏరియాలో సిపిఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. సిపిఎం నాయకులు ఎం వెంకటరావు, సత్యనారాయణ జయమ్మ, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

మాధవధార : సిపిఎం కంచరపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రచారంలో భాగంగా తోటవీధి, చెవిటి రావుల వీధి,పై వీధి, కింద వీధి, గొల్ల కంచరపాలెం ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో జోన్ కార్యదర్శి బొట్టా. ఈశ్వరమ్మ ఎం. ఈశ్వరరావు ఎస్.సోమేశ్వరరావు బి. పద్మ పాల్గొన్నారు



మునగపాక మండలం తోటాడలో...



మధురవాడ ప్రాంతంలో...



కంచరపాలెం ప్రాంతంలో...



దాడి ఎరుకునాయుడుకు నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

పంచాయతీ పరిషత్ రాష్ట్ర కార్యదర్శిగా దాడి

ప్రజాశక్తి-కె.కోటపాడు : పంచాయతీ పరిషత్ ఎపి రాష్ట్ర కార్యదర్శిగా చౌడువాడ సర్పంచ్ దాడి ఎరుకునాయుడును నియమించారు. ఈ మేరకు ఎరుకునాయుడుకు అఖిలభారత్ పంచాయతీ పరిషత్ కార్యదర్శి ఎస్ఎస్ విజయ మిశ్రా చేతుల మీదుగా నియామకపత్రాన్ని న్యూఢిల్లీలో అందజేశారు. ఈ సందర్భంగా పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, ఏపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముల్లంగి రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి కొత్త మునిరెడ్డి, గొల్ల మాల్యాద్రి నాయుడు తదితరులు దాడి ఎరుకనాయుడును శాలువాతో సత్కరించారు. ఎరుకునాయుడు నియామకం పట్ల అనకాపల్లి జిల్లాకు చెందిన పలువురు స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, తోటి సర్పంచులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా దాడి ఎరుకు నాయుడు మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం బలవంతరాయ్ మొహతా, భారతరత్న జయప్రకాష్ నారాయణ కలిసి ఈ పరిషత్‌ను స్థాపించారని, ఇందులో ఎందరో మాజీ ప్రధానులు, కేంద్ర మంత్రులు, మేధావులు పనిచేశారని తెలిపారు. ఇటువంటి గొప్ప సంస్థలో పనిచేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు.

ఓటర్ల నమోదు నిత్య ప్రక్రియ



ప్రజాశక్తి - యలమంచిలి : ఓటర్ల నమోదు నిత్య ప్రక్రియ అని యలమంచిలి డిప్యూటీ తహశీల్దారు వీరభద్రాచారి వెల్లడించారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఆగస్టు 31 నాటికి పూర్తయిన ఇంటింటి సర్వే ప్రకారం యలమంచిలి నియోజకవర్గంలో 68,607 ఇళ్లు ఉండగా, 2,05,016 మంది ఓటర్లున్నారని తెలిపారు. ఈ లిస్టులో కొత్త ఓటర్లు 3,336 మంది ఉన్నారన్నారు. చనిపోయిన వారు 5,086 మంది నమోదైనప్పటికీ, ఫారం-7లో నిర్ధారించాల్సి ఉందని పేర్కొన్నారు. పర్మినెంట్‌గా గ్రామం విడిచివెళ్లిన వారు, సర్వే సమయంలో అందుబాటులో లేని ఓటర్లు సుమారు 1500 ఉన్నప్పటికీ, ఈ సంఖ్య మారే అవకాశం ఉందన్నారు. ఇంటిపేర్లు, అడ్రసు, వార్డు మార్పులు, డబుల్ ఎంట్రీ వారు 4,925 సవరణ చేయించుకున్నారని తెలిపారు. ఓటర్ డ్రాఫ్ట్ లిస్టు అక్టోబరు 17 నాటికి పూర్తవుతుందని, అప్పుడు కూడా తగిన ఆధారాలు చూపించి అభ్యంతరాలు, మార్పులు చేసుకోవచ్చుని చెప్పారు. యలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం, మునగపాక మండలాల్లో మొత్తం 243 పోలింగ్ స్టేషన్ల పరిధిలో బ్లాక్ లెవల్ ఆఫీసర్లు 243 మంది పాల్గొన్నారని తెలిపారు.

'భవిషత్తుకు గ్యారెంటీ' బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చోడవరం

బాబు షూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ అనే బ్రోచర్‌ను స్థానిక లక్ష్మమ్మ కళ్యాణ మండపంలో గురువారం మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు, టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్యబాబు, నాయకులు ఆవిష్కరించారు. అనంతరం లోకేష్ పాదయాత్రకు సంఘీభావంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు, తాతయ్యబాబు మాట్లాడుతూ వైసిపి పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ నాలుగేళ్ల కాలంలో రాష్ట్రం అధోగతి పాలైందని విమర్శించారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా టిడిపి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లు నాయుడు, మాజీ జెడ్పిటిసి గోకివాడ కోటేశ్వరరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూతి కోటేశ్వరరావు, రాజానకొండ నాయుడు, టిడిపి మండల అధ్యక్షుడు బొడ్డేటి నాగ గంగాధర్, నాయకులు వియ్యపు అప్పారావు, దేవరపల్లి వెంకట అప్పారావు, దొడ్డి కిషోర్ పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజు, టిడిపి నేతలు

వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా

ప్రత్యామ్నాయ పంటలకు ప్రణాళికలు

కలెక్టర్ రవి పటాన్‌శెట్టి ఆదేశం

ప్రజాశక్తి- అనకాపల్లి

జిల్లాలో ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు ఉన్నందున ప్రత్యామ్నాయ పంటల కొరకు ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ రవి పటాన్ శెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం జరిగిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదు ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. డ్రిప్ ఇరిగేషన్ సాగులను పెంచాలని సూచించారు. జిల్లాలో జగనన్న పాలవెల్లువ పథకం కింద ఇంకా ప్రారంభం కాని 112 పాల సేకరణ కేంద్రాలను త్వరగా ప్రారంభించేందుకు కృషి చేయాలని డిఆర్‌డిఎ పీడీ, డిసిఓలను ఆదేశించారు. డొమెస్టిక్ చేపల విక్రయ కేంద్రాలను ఏర్పాటు పనులను వేగవంతం చేయాలన్నారు. పంట సాగుదారు హక్కు పత్రాలు కలిగిన కౌలు రైతులు అందరికీ రుణాలు అందించటానికి బ్యాంకులతో సమీక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జాహ్నవి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, వ్యవసాయ శాఖ జెడి మోహన్ రావు, ఉద్యానవన శాఖ ఏడి ప్రభాకర్ రావు, సెరీకల్చర్ ఏడి వర్మ, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ జయంతి, మార్కెటింగ్ శాఖ ఏడి రవి కిరణ్, ఫిషరీస్ అధికారి ప్రసాద్, లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, వ్యవసాయ సలహా సంఘం సభ్యులు ఆర్.గంగు నాయుడు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, జెసి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్, అధికారులు

మరిడిమాంబ అమ్మవారికి ఎంపీ దంపతుల పూజలు

ప్రజాశక్తి -అనకాపల్లి : స్థానిక కోట్నీవీధి మరిడిమాంబ అమ్మవారిని పార్లమెంట్ సభ్యురాలు బీశెట్టి వెంకట సత్యవతి విష్ణుమూర్తి దంపతులు గురువారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సత్కరించారు.

నూకాంబిక పాలక మండలి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-అనకాపల్లి : శ్రీనూకాంబిక దేవస్థానంలో గురువారం ఆలయ మండపంలో నూతన పాలక మండలి సభ్యులు చేత ఈవో బండారు ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేయించారు. పాలకమండలి చైర్మన్‌గా కొణతాల మురళీకృష్ణ, సభ్యులుగా కంటపల్లి శోభారాణి, పీలా లక్ష్మి, పాము అనూరాధ, మల్లవరపు ఈశ్వరరావు, ఆడారి ఉమాచంద్రమహేశ్వరి, బుద్ధ నరసింగరావు, గొల్లవిల్లి నరసింగరావు, కొండూరు రవీంద్రనాథ్, ఎక్స్ అఫీషియో మెంబెర్‌గా వై.శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేశారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న పాలక మండలి సభ్యులు

5న వెలుగు విఒఎల సమస్యలపై ఆందోళన



మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు రూపాదేవి

ప్రజాశక్తి-అనకాపల్లి

వైయస్సార్ క్రాంతి పథకంలో పనిచేస్తున్న వెలుగు విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్ (యానిమేటర్లు) సమస్యలపై సెప్టెంబర్ 5న జిల్లా కేంద్రంలోని డిఆర్‌డిఎ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు ఏపీ వెలుగు వివోఏల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.రూపాదేవి తెలిపారు. అనకాపల్లి సిఐటియు కార్యాలయంలో గురువారం జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడుతూ అధిక పని ఒత్తిడి తగ్గించాలని, వేధింపులు ఆపాలని, లోకోస్ యాప్ నిర్వహణకై సెల్ ఫోన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జరిగే ఈ ధర్నాలో వెలుగు వివోఏలంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మూడు సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, ఉద్యోగ భద్రతకై సిబిఓహెచ్ఆర్ పాలసీ అమలు చెయ్యాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, అన్నిరకాల బకాయిలు చెల్లించాలని కోరారు. మహిళాభ్యున్నతిలో డ్వాక్రా సంఘాలు పాత్ర ఎంతో కీలకంగా ఉందని ప్రభుత్వాలు చెప్పుకుంటున్నా, ఈ మహిళలను ఆర్గనైజ్ చేస్తున్న వివోఏల పట్ల రాష్ట్ర ప్రభుత్వం కపట ప్రేమ చూపిస్తుందని విమర్శించారు. గతంలో సంఘాలను విడగొట్టిన ప్రభుత్వమే నేడు గ్రామ సమాఖ్యల మెర్జ్ పేరుతో వివోఏలను కుదించాలని చూస్తుందని, ఈ విధానాన్ని ఆపాలని కోరారు. జెండర్, వయస్సు, చదువు పేరుతో తొలగింపులు ఆపాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా మార్టుల పేరుతో విఓఏలకు టార్గెట్లు ఇచ్చి తీవ్ర వేధింపులు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు వివి శ్రీనివాసరావు, జిల్లా కోశాధికారి కె.లక్ష్మీప్రసన్న, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వరి నాట్లుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

తెరువుపల్లి రైతు క్షేత్రంలో 'పొలం బడి'

ప్రజాశక్తి - యలమంచిలి : మున్సిపాలిటీ పరిధి తెరువుపల్లి గ్రామంలో గురువారం 25 మంది వరి రైతుల్ని గుర్తించి 'పొలం బడి' కార్యక్రమం నిర్వహించారు. మత్తి ఫకీర్‌నాయుడు, వెంకటరమణ పొలంలో 25 మంది రైతులకు మండల వ్యవసాయాధికారి మోహనరావు విత్తన శుద్ధి పద్ధతులు, నారు తీసిన వెంటనే చిగుళ్ల తుంచడం గురించి వివరించారు. చిగుళ్ళ తుంచడం మూలంగా ఆకుముడత తెగులు, ఇతర తెగుళ్ళ వెంటనే రాకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. నీటి ఎద్దడి మూలంగా వరి పంట నాట్లు వేయడం కాస్త ఆలస్యమైనా పంట నమోదు చేయడం జరుగుతుందని చెప్పారు. వ్యవసాయ సహాయకులు ప్రవీణ పాల్గొన్నారు.

సమర్థవంతంగా ఓటర్ల సర్వే


ప్రజాశక్తి-అనకాపల్లి : ఓటర్ల సర్వే సమర్థవంతంగా నిర్వహించి జాబితాలో మృతులు, శాశ్వత వలసలు వెళ్లిన వారిని తొలగించే ప్రక్రియ నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి తెలిపారు. సంక్షిప్త ఓటర్ల సవరణ జాబితా ప్రక్రియపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షిప్త ఓటర్ల సవరణ జాబితా కొరకు 100 శాతం గృహాలను సర్వే చేశామని చెప్పారు. ఓట్ల తొలగింపుల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించే ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. ఇప్పటి వరకు 37041 మంది మృతులు, 12,534 మంది శాశ్వత వలసలు వెళ్లినట్లు, 18871 మంది ఆబ్సెంట్ ఓటర్లుగా గుర్తించినట్లు చెప్పారు. వాటి ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి నిర్ధారిస్తున్నామన్నారు. నూతనంగా ఓటుహక్కు పొందడానికి వచ్చిన దరఖాస్తులు అర్హత ఉంటే గుర్తించి వాటిని జాబితాలో చేర్చుతామని వెల్లడించారు. ఓట్ల సవరణ జాబితా పక్కాగా రూపొందించడానికి పారదర్శకంగా ప్రక్రియ చేపట్టామని వివరించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను రాజకీయపార్టీల నాయకులు కలెక్టరు దృష్టికి తెచ్చారు. ఇన్‌ఛార్జి డిఆర్ఓ అనిత, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ పండుగ

ప్రజాశక్తి- పరవాడ : పరవాడలోని మరిడిమాంబ అమ్మవారి పండగ మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్, వైసిపి సిఇసి సభ్యులు పైల శ్రీనివాసరావు, జెడ్పిటిసి సభ్యులు పైల సన్యాసిరాజు, పరవాడ సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, మాజీ జెడ్పిటిసి పైల జగన్నాథరావు, మాజీ ఎంపిపి మాసవరపు అప్పలనాయుడు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బొండా సన్ని దేముడు, వియ్యపు చిన్నా, పైల సన్యాసిరావు (మాస్టారు) పాల్గొన్నారు.

పాడి రైతులకు బీమా పరిహారం

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చెయ్యపేట మండలం కోమళ్లపూడిలో ఇద్దరు పాడి రైతులకు గురువారం విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ బీమా పరిహారాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన గేదెల సత్తిబాబు, గండెం ఈశ్వరరావులకు చెందిన పాడి గేదెలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాయి. ఈ నేపథ్యంలో ఒక్కో గేదెకు రూ.50వేలు చొప్పున బీమా పరిహారం మంజూరైంది. సంబంధిత చెక్కులను పాడి రైతులకు విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ చేతుల మీదుగా అందించారు. పాడి రైతుల సంక్షేమానికి విశాఖ డెయిరీ అధిక ప్రాధాన్యమిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏరియా మేనేజర్ ప్రసాద్, వైసిపి సీనియర్ నాయకులు ఎన్నంశెట్టి అచ్చంనాయుడు, గొన్నా ఈశ్వరరావు పాల్గొన్నారు.



బీమా చెక్కు అందజేస్తున్న విశాఖ డెయిరీ డైరెక్టర్ సత్యనారాయణ

క్రీడా పోటీల్లో సత్తా చాటిన వికలాంగ విద్యార్థులు

ప్రజాశక్తి -బుచ్చెయ్యపేట

చోడవరంలో నిర్వహించిన జిల్లా స్థాయి వికలాంగుల క్రీడా పోటీల్లో మండలానికి చెందిన వికలాంగులు సత్తా చాటారు. సీనియర్ రన్నింగ్ విభాగంలో రావలపూడి గణేష్, దృష్టిలోపం బాలికల రన్నింగ్ విభాగంలో తుంపాల శ్రావణి, శారీరక వైకల్యం విభాగంలో చొప్ప జాన్, వినికిడి లోపం విభాగం స్లోవాక్‌లో సుంకర కుమార్ ప్రథమ స్థానం, పల్లి ప్రసాద్ ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరిని హెచ్ఎం కె.సత్యారావు, ప్రత్యేక ఉపాధ్యాయులు బి.ఎ.రాజు, డ్రిల్ మాస్టర్ కిరణ్ కుమార్, ఉపాధ్యాయులు వెంకట్, డివిజె.అప్పారావు అభినందించారు.



పతకాలు సాధించిన వికలాంగ విద్యార్థులు

దుర్గాదేవి విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-కె.కోటపాడు : స్థానిక షిరిడి సాయి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో షిర్డీ సాయిబాబా ఆలయం పక్కన ఏర్పాటు చేసిన శ్రీదుర్గా దేవి విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. కింతాడ ఉప సర్పంచ్ బండారు ముత్యాల నాయుడు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటపాడులో దుర్గా దేవి ఆలయ నిర్మాణానికి పూనుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో రమేష్ బాబు, యలమంచిలి ధర్మారావు, వేగి రామారావు, ముదినూరి వర్మరాజు, బండారు గడ్డిబాబు, పండూరి వీరాచారి, రాజగిరి దేముడు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కామాక్షి ఏకాంబరేశ్వరుల కల్యాణం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక గవరపాలెంలోని కామాక్షిదేవి ఆలయంలో శ్రావణ శుద్ధ పౌర్ణమి గురువారం ఆలయ మండపంలో కామాక్షి ఏకాంబరేశ్వరుల కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. కోటిపల్లి అనంత నాగ శ్రీనివాస్ సంతోష్ కుమారి దంపతులు స్వామి కళ్యాణం జరిపించారు. అనంతరం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. వైసిపి పార్లమెంట్ పార్టీ పరిశీలకులు దాడి రత్నాకర్ అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పట్టణం విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కోటిపల్లి జేజిబాబు, ప్రధాన కార్యదర్శి కొమ్మోజు గోవిందరావు, కోశాధికారి పొన్నాడ వెంకట సత్య నరసింహచారి, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘ పెద్దలు పాల్గొన్నారు.

తమ్మపాల సెంట్రల్ లైటింగ్ సమస్యపై వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : తుమ్మపాల గ్రామంలో సెంట్రల్ లైటింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు గురువారం ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. కరెంట్ ఆఫీస్ నుండి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు సెంట్రల్ లైటింగ్ వెలగలేదని, సదరు సమస్యను వెంటనే పరిష్కారం చేయాలని కోరారు. దీనిపై డిఈ సురేష్ స్పందిస్తూ సమస్యను వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 14వ వార్డ్ మెంబర్ కొయ్య జగదలక్ష్మి భాస్కర్, పొలమర శెట్టి ఈశ్వరరావు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

పశువైద్యశాల సిబ్బంది నిర్లక్ష్యంతోనే కుక్క మృతి

ప్రజాశక్తి-వడ్డాది : వడ్డాది పశువైద్య శాల సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే తమ పెంపుడు కుక్క చనిపోయిందని స్థానిక యువకుడు ఆది హరీష్ ఆరోపించారు. స్థానిక కోవెల వీధికి చెందిన హరీష్ అనారోగ్యంతో బాధపడుతున్న కుక్కని వడ్డాది పశు వైద్యశాలకు తీసుకెళ్లానని, వైద్యాధికారి అందుబాటులో లేకపోవడం స్థానిక సిబ్బందిని కుక్కకు వైద్యం చేయమని అభ్యర్థించగా వారు నిర్లక్ష్యంగా వ్యవహరించారని హరీష్ ఆరోపించారు. చాలా సేపు పట్టించుకోలేదని, చివరకు ఓ ఇంజక్షన్ చేసి పంపించేశారని తెలిపారు. దీంతో బుధవారం రాత్రి తమ కుక్క చనిపోయిందని ఆవేదన చెందారు. పశు వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

విలువ ఆధారిత ఇంటి పన్నుపై ప్రచారం

ప్రజాశక్తి-అనకాపల్లి : విలువ ఆధారిత ఇంటి పన్నులు పెంచడంపైనా, నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుదలపైనా ప్రజలకు వివరించడానికి తెలుగుదేశం పార్టీ 80వ వార్డు నాయకులు గురువారం పట్టణంలోని విల్లూరు అక్కయ్య గారి వీధి, వేలం వీధి, పీలా పోతినాయుడుగారి వీధిలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. వైసిపి ప్రభుత్వం ప్రజలపై పన్నుల భారాన్ని ఏ విధంగా రుద్దుతుందో ప్రజలకు వివరించారు. జీవిఎంసీ అధికారులు డిమాండ్ నోటీసు గత సంవత్సరానికి ఈ సంవత్సరానికి ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా పాత 22వ వార్డు టిడిపి అధ్యక్షులు విల్లూరు రమణబాబు, టిఎన్టియుసి పార్లమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి భువనేశ్వరరావు మాట్లాడుతూ భూమి విలువ ఆధారిత ఇంటి పన్నులు ప్రతి సంవత్సరం 15శాతం పెంచడం అన్యాయమన్నారు. ఇంటి పన్నులో చెత్త పన్ను కలిసి ఉండగా, ఇంటి పన్ను నుండి విడదీయకుండా చెత్త పన్ను వసూలు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో పెంటకోట చంద్ర, దాడి త్రినాథ్, విల్లూరి సత్తిబాబు, పెంటకోట ప్రసాదు, పెంటకోట నాయుడు, విల్లూరి సత్య నర్సింగరావు, కాంగ్రెస్ శీను, దొడ్డి అప్పారావు పాల్గొన్నారు.



రుణ మేళాలో పాల్గొన్న అధికారులు, పాడి రైతులు

జగనన్న పాలవెల్లువ రుణమేళా

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని త్యేగాడ గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జగనన్న పాలవెల్లువ పథకంలో భాగంగా రుణమేళా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కశింకోట, కన్నూరుపాలెం పశు వైద్య అధికారులు డాక్టర్ అల్లహన్స్ జార్జ్, డాక్టర్ దయానా మాట్లాడుతూ మహిళా పాడి రైతుల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. అమూల్ కేంద్రానికి పాలు పోసే ప్రతి ఒక్క రైతు రూ.30వేలు రుణం మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. సహకార సంఘాల ద్వారా లక్ష రూపాయల నుండి రూ.1.60 లక్షల వరకు రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు కొన అరుణ నాగేశ్వరరావు, నీటిపల్లి ఈశ్వరమ్మ, నీటిపల్లి దివాకర్, డీసీసీబీ బ్యాంక్ ప్రతినిధి అచ్యుయ నాయుడు, సిబ్బంది వాణి, ఎహెచ్ఎ అశ్విని, విఏఎలు, 40 మంది రైతులు పాల్గొన్నారు.



నిర్మాణం జరిగిన కెబి రోడ్డు

తుది దశకు కెబి రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి-బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట మండలంలో కశింకోట-బంగారు మెట్ట కేబీ రోడ్డు నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. 24 కిలోమీటర్ల మేర తారు రోడ్డు నిర్మిస్తున్నారు. దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యాయి. ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ప్రత్యేక చొరవ తీసుకుని రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయిస్తున్నారు. అడపాదడపా కురుస్తున్న వర్షాల వల్ల నిర్మాణ పనులు కొంత ఆలస్యమయ్యాయి. మరో 4 వారాల్లో రోడ్డు నిర్మాణం పూర్తవుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణానికి రూ.32 కోట్ల నిధులు మంజూరు చేయించారు. ఈ రోడ్డులో అంతర్గాగంగా నాలుగు పెద్ద వంతెనలు, 13 కల్వర్టులు నిర్మిస్తున్నారు. ప్రయాణం సాఫీగా జరిగేలా విశాలంగా రోడ్డు నిర్మాణం పూర్తవుతుంది. ఎమ్మెల్యే చొరవ చూపి సంబంధిత ఉన్నతాధికారులు కాంట్రాక్టర్‌తో మాట్లాడి వేగంగా నిర్మాణం జరిగేటట్లు కృషి చేశారు. బుచ్చెయ్యపేట, రావికమతం మండలాల ప్రజలకు రవాణా కష్టాలు తీరనున్నాయి. ఎర్రవాయి ప్రాంత ప్రజలు జిల్లా కేంద్రం అనకాపల్లి వెళ్లేందుకు ఈ రోడ్డు ఎంతో ఉపయోగపడుతుంది. రోడ్డు నిర్మాణం పూర్తవుతుండడంతో ఈ ప్రాంత ప్రజల సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చట్టాలపై ప్రజలకు అవగాహన అవసరం

ప్రజాశక్తి-దేవరాపల్లి : ప్రజలకు చట్టాలపై అవగాహన అవసరమని ఎస్ఐ డి.నాగేంద్ర అన్నారు. మండలంలోని చిననందిపల్లి గ్రామంలో గురువారం పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పౌర హక్కుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఎస్.సురేష్, వీఆర్వో స్వాతి, సచివాలయం మహిళా పోలీస్ దేవి, పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని కలపాక పంచాయతీ ఎస్సీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరవాడ సిఐ పి.ఈశ్వరరావు మాట్లాడుతూ ఎవరైనా నిర్భయంగా పోలీసు స్టేషన్‌కు వచ్చి తమకు జరిగిన అన్యాయాలపై ఫిర్యాదు చేయొచ్చన్నారు. వాటిపై చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరవాడ డిప్యూటీ తహశీల్దారు శాంతి భూషణరావు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

దస్తావేజు లేఖర్ల ఆందోళన



నక్కపల్లిలో నినాదాలు చేస్తున్న దస్తావేజులేఖర్లు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ) : రాష్ట్ర ప్రభుత్వం కార్డు ప్రైమ్ 2 .0 విధానాన్ని నిలిపివేయాలని, దీనివల్ల దస్తావేజు లేఖరుల తోపాటు ప్రజలు కూడా తీవ్రంగా నష్టపోతారని దస్తావేజు లేఖరుల సంఘం నాయకులు ఎస్.హెచ్.వి.రామకృష్ణ, అక్కిరెడ్డి త్రినాథ్ అన్నారు. సూపర్ బజార్ వద్ద ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పెన్‌డౌన్ పేరుతో చేపట్టిన నిరసన గురువారమూ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ కొత్త విధానం వల్ల లీగల్ సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. రుణాలు, వారసత్వ విషయంలో కూడా సమస్యలు ఏర్పడతాయన్నారు. ప్రభుత్వం తక్షణమే ఈ కొత్త విధానాన్ని నిలిపివేసి, పాత విధానాన్ని కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ చంద్రశేఖర్, మురళీకృష్ణ ,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి : కార్డు ప్రైమ్ 2.0 వెర్షన్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ముషిడివాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద గురువారం రెండో రోజు డాక్యుమెంట్ రైటర్స్ నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డాక్యుమెంట్ రైటర్ చిన్నారావు మాట్లాడుతూ, ఏళ్లతరబడి డాక్యుమెంట్ రైటర్‌గా జీవనం సాగిస్తున్న తమ జీవనోపాధిని, నూతన పాలసీతో హరించవద్దని విజ్ఞప్తి చేశారు.

మధురవాడ : కంప్యూటరైజ్డ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ (కార్డ్) 2.0 విధానాన్ని వ్యతిరేకిస్తూ దస్తావేజు లేఖర్లు మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద గురువారం నిరసన చేపట్టారు. . ఈనెల 15 నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌లలో ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్తపాలసీతో దస్తావేజు లేఖర్ల కుటుంబాలు రోడ్డున పడతాయనిఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, మోహన్, కిషోర్, ఆశారాణి, గిరి, రమణయ్యప్రసాద్, మహేష్, లోకేష్ పాల్గొన్నారు.

ఆనందపురం : ప్రజలకు ఏమాత్రం ఉపయోగం లేకపోవడమే కాకుండా, నష్టాన్ని కలిగించే కార్డు ప్రైమ్ 2.0 డాక్యుమెంట్ల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానాన్ని రద్దు చేయాలని దస్తావేజు లేఖర్ల మండల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఏనుగుల సత్యారావు కోరారు. ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ గురువారం రెండో రోజు స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో మరి పిల్లి ప్రసాదరావు, వేణుగోపాలరావు, గణేష్, పార్థసారథి, చిన్న గణేష్, నవీన్‌కుమార్, రామకృష్ణ, చిన్నారావు, పాత్రుడు, మూర్తి, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.కాగా దస్తావేజు లేఖర్ల ఆందోళనకు ప్రజలమద్దతు లభించింది, గురువారం కేవలం ఒకటే రిజిస్ట్రేషన్ జరిగింది.

నక్కపల్లి: దస్తావేజు లేఖర్లు చేపట్టిన పెన్ డౌన్ కార్యక్రమం రెండవ రోజు గురువారం కూడా కొనసాగింది. స్థానిక సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్లు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. పాత పద్ధతిలోనే రిజిస్ట్రేషన్లు కొనసాగించాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కెవి సత్యనారాయణ, తుమ్మల వెంకట రమణలు సంఘీభావం తెలిపారు.. ఈ కార్యక్రమంలో దస్తావేజు లేఖర్లు కొంగర చిన్న కృష్ణమూర్తి, దాతారం మురళీకృష్ణ, నవర వెంకట రమణ, కే సూర్యనారాయణ, బొంతు రాజు, జి.నూకరాజు, పొడగట్ల రమేష్, పంపర బోయిన లోవరత్నం, తుమ్మల గోవిందు, బత్తుల శీను, సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రెండవ రోజు పెన్ డౌన్ సమ్మె కొనసాగింది. ప్రైమ్ 2.0 సాఫ్ట్ వేర్ వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ హర్షవర్ధన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు స్వామి మాట్లాడుతూ, ప్రైమ్ - 2.0 విధానంతో తలెత్తే ఇబ్బందులను ప్రజల దృష్టికి తీసుకు వెళతామని తెలిపారు. ఈ కార్యక్రమంల వైస్ ప్రెసిడెంట్ నరం సన్యాసినాయుడు, సెక్రటరీ ఆర్ఎస్. శివకుమార్, వాణి, కన్నబాబు, సత్తిబాబు, కన్నబాబు, నాయకులు మారిశెట్టి రాజా, ప్రోగ్రామ్ కమిటీ మెంబర్ కొత్తకోట రామశేఖర్ పాల్గొన్నారు.

సబ్బవరం: ప్రభుత్వం నూతన రిజిస్ట్రేషన్ విధానాన్ని అమలు చేయొద్దని దుర్గమాంబ దస్తా వేజుల లేఖర్ల సంఘం ఆధ్వర్యాన లేఖర్లు మండల కేంద్రంలో చేపట్టిన పెన్‌డౌన్ కార్యక్రమం రెండోరోజు కొనసాగింది. ఈ సందర్భంగా సంఘం సంయుక్త కార్యదర్శి శేఖరమంత్రి శ్రీనివాసరావు, సీనియర్ దస్తావేజు లేఖర్లు భిక్కవల్లి రాంబాబు, వల్లభజోస్యుల సీతారామమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన రిజిస్ట్రేషన్ నూతన విధానంతో దస్తావేజు లేఖర్ల జీవనోపాధికి ముప్పు వాటిల్లుతుందని, దానిని రద్దు చేసి, పాత విధానాన్ని కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో బొగ్గారపు రత్నాజీ, బోకం ఈశ్వరపాలవెల్లి, జూరెడ్డి రామమూర్తి, రావాడ చంద్రశేఖర్, వడిసెల దేముడు, దంతులూరి సురేష్ వర్మ, సబ్బవరపు బాలకృష్ణ, కొయ్య వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



పెందుర్తిలో..



ఆవేదన వ్యక్తం చేస్తున్న రోగులు

రోగుల అవస్థలు

ప్రజాశక్తి-నక్కపల్లి: స్థానిక 50 పడకల ఆసుపత్రిలో మరుగుదొడ్డిలో నీరు నిల్వ ఉండి పోతుందని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేశారు. శానిటేషన్ సిబ్బంది బాత్రూం లను శుభ్రం చేస్తున్నప్పటికీ పైప్ లైన్ సక్రమంగా లేకపోవడంతో వాడిన నీరు ఎక్కడికక్కడ నిలిచి పోతుందన్నారు. దీంతో నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపక నియామక పోస్టుల భర్తీకి ఈనెల 4న లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కొండబాబు తెలిపారు. ఎంపిహెచ్‌డబ్ల్యు బోధించేందుకు మహిళ అధ్యాపకురాలు బిఎస్సి నర్సింగ్ చేసి ఉండాలని, జి ఎఫ్‌సి సబ్జెక్టు బోధించేందుకు ఎంఎ, ఎకనామిక్స్ ఎంఎ రూరల్ డెవలప్మెంట్ చేసి ఉండాలని తెలిపారు. 50 శాతం మార్కులు తప్పనిసరి అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పీసా చట్టం పటిష్టంగా అమలు చేయాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: పీసా చట్టం పటిష్టంగా అమలు చేయాలని పిసా చట్టం అమలు కమిటీ చైర్మన్ దొండా ప్రసాద్ కోరారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, షెడ్యూల్ ఏరియాలో పీసా చట్టం పటిష్టంగా అమలు చేసి గ్రామ సభలు నిర్వహించి సహజ వనరులను కాపాడాలని కోరారు. దీనిపై అమరావతిలో గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శికి వినతి పత్రం అందించినట్లు తెలిపారు. ఏజెన్సీలో పీసా చట్టం అమలు చేయకపోవడంతో సహజ వనరులన్నీ దోపిడీ జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం రాష్ట్ర కార్యదర్శి జక్కు నరసింహమూర్తి, నాయకులు పాల్గొన్నారు.

రెవెన్యూ సహాయకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో పందూరు గ్రామ రెవెన్యూ సహాయకుడు బెండడి బుల్లిబాబు (52) గురువారం మృతి చెందాడు. కుటుంబ గొడవల నేపథ్యంలో గ్రామంలో గురువారం మధ్యాహ్నం గుళికలు సేవించడంతో కోటవురట్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో నర్సీపట్నం ఏరియా హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఇతను గడిచిన 20 సంవత్సరాలుగా గ్రామంలో రెవెన్యూ గ్రామ సహాయకుడిగా పని చేస్తూ ఉన్నాడు. పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.



పరిశీలిస్తున్న అధికారులు

వివాద స్థలం పరిశీలన

ప్రజాశక్తి-కోటవురట్ల: మండల కేంద్రం రాట్నాల పాలెం వద్ద స్థల వివాదంపై జగనన్నకు చెబుదాం లో దళితులు చేసుకున్న ఫిర్యాదును గురువారం మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ, ఉప తహసిల్దార్ సోమశేఖర్ పరిశీలించారు. ఇరు వర్గాలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, స్థల వివాదం పరిశీలించడంతో పాటు ఇరువర్గాల నుండి స్టేట్మెంట్ తీసుకున్నామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాయని పేర్కొన్నారు.


ఇంటి పట్టా ఇచ్చారు..

స్థలం మరిచారు...



బాధితురాలు లక్ష్మి

ప్రజాశక్తి-రోలుగుంట: 2019 సంవత్సరంలో జగనన్న ఇంటి స్థలం పట్టా ఇచ్చారు. కానీ స్థలం చూపించలేదని మండలంలోని జానకిరాంపురం అగ్రహారం గ్రామానికి ఆనుకొని ఉన్న కోనేటి చెరువు గట్టుపై నివాసముంటున్న ఎస్సీ యానాదులు కులానికి చెందిన 11 కుటుంబాలు వారు ఆవేదన వ్యక్తం చేశారు. 2019 సంవత్సరంలో చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ సర్వే నెంబరు 27.7లో లేఅవుట్ల ఉత్తర్వుల నెంబరు 324/2019 పట్టా ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారని, ఇటీవల ఎమ్మెల్యే గడపగడపకు వైయస్సార్‌లో జెపి.అగ్రహారం వచ్చినప్పుడు కలిస్తే తమకు ఇళ్లు మంజూరు చేశామని పునాదులు తీసుకోవాలి చెప్పారన్నారు. స్థలాలు ఎక్కడ ఇస్తారని అడిగితే పాపంపేటలో ఇస్తామని వెళ్లి పోయారన్నారు. 11 సంవత్సరాల నుండి ఇక్కడే ఉంటున్నామని చెప్పగా రొంగలపాలెంలో ఇస్తామని సర్పంచ్ అన్నారని, మా పక్కన చెరువు వద్దే ఇస్తానని అనడం తప్పా తమకు స్థలాలు కేటాయించలేదన్నారు. 11 సంవత్సరా లుగా ఈ తాటాకు గుడిసెల్లోనే జీవనం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు పక్కనే ఉంటున్నామని, వీధిలైట్లు కూడా పది రోజులుగా వెలగలేదని, దీంతో రాత్రులు భయాందోళనకు గురవుతున్నామన్నారు.



ప్రభుత్వం ఇచ్చిన పట్టా

ఎమ్మెల్యే బాబూరావుకు సత్కారం

ప్రజాశక్తి-గొలుగొండ: పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావును గురువారం జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు, ఏఎల్ పురం సర్పంచ్ లోచల సుజాత మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు శాలువ కప్పి ఘనంగా సత్కరించారు.



సత్కరిస్తున్న సుజాత

జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ..

విభిన్న ప్రతిభా వంతుల సత్తా

ప్రజాశక్తి- రావికమతం :చోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అనకాపల్లి జిల్లా సమగ్ర శిక్ష- పాఠశాల విద్యాశాఖ, రోటరీ క్లబ్ ఆఫ్ (విశాఖ) సెంటోనియల్ సమన్వయంతో నిర్వహించిన జిల్లా సాయి దివ్యాంగుల క్రీడా పోటీల్లో రావికమతం మండలానికి చెందిన విభిన్న ప్రతిభా వంతులు సత్తా చాటారు.శారీరక వైకల్యం కేటగిరిలో షాట్ పుట్, జావిలెన్ త్రో సీనియర్ విభాగంలో చినపాచిలకు చెందిన కోసూరు లోకేష్ ప్రథమ, పాక్షిక దృష్టిలోపం విభాగంలో జెడ్ కొత్తపట్నం చెందిన కురస సిద్ధార్థ షాట్ పుట్, జావిలెన్ త్రో సీనియర్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచాడు. మానసిక వైకల్యం జూనియర్ విభాగంలో మేడివాడ ఉన్నత పాఠశాలకు చెందిన బత్తిన లిఖిత, మైచర్ల నిఖిల్‌లు స్లోవాక్, 50 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానాలను పొందారు. వియ్యపు హరీష్ లు వంద మీటర్ల పరుగుపందెంలో ద్వితీయ, శారీరక వైకల్యం సీనియర్ కేటగిరిలో 100 మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానాన్ని గెలుపొందారని ప్రత్యేక ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, జగన్నాథ నాయుడు తెలిపారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.వెంకట లక్ష్మమ్మ, రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖ సెంటోనియల్ ప్రెసిడెంట్ కే.వి.వి.ఎస్ మూర్తి, అనకాపల్లి సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయకర్త బి.శకుంతల, చోడవరం మండల విద్యాశాఖ అధికారిని జయలక్ష్మిలు మెమొంటో, సర్టిఫికెట్ లను అందించారు.మేడివాడ స్కూల్ అసిస్టెంట్ ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మి నాయుడును, ప్రత్యేక ఉపాధ్యాయుడు జగన్నాథం నాయుడులను జిల్లా విద్యాశాఖ అధికారిణి వెంకట లక్ష్మమ్మ, జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయకర్త శకుంతల అభినందించారు.



బహుమతులు ఇస్తున్న ఉన్నతాధికారులు

పౌర హక్కులపై అవగాహన

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని పాత మల్లంపేట పంచాయతీ హుకుంపేటలో గురువారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై నారాయణరావు, ఎంపిడిఒ డేవిడ్‌రాజులు పౌర హక్కుల దినోత్సవంపై వివరించారు. అనంతరం సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ నాగరాజు, సర్పంచ్ మామిడి ఆదిలక్ష్మీ ఆనంద్, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ అప్పారావు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

ఆస్పత్రిని తనిఖీ చేసిన కలెక్టర్

-సమస్యలపై ఆరా -పలు సమస్యలపై వినతులు

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం జిల్లా కలెక్టర్ రవి సుభాష్ పఠాన్ శెట్టి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎమర్జెన్సీ, జనరల్ వార్డులను పరిశీలించారు. ఎక్స్ రే రూము సందర్శించి, రోజుకు ఎన్ని ఎక్స్ రేలు తీస్తారని అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్‌ను పరిశీలించి, ఎన్ని రకాల టెస్టులు చేస్తారో ఆరా తీసారు. ఆరోగ్యశ్రీ పథకానికి సంబంధించి రోగుల వివరాలను ఎలా నమోదు చేస్తారో అనే సమాచారాన్ని సిబ్బందిని అడిగి క్షుణంగా పరిశీలించారు. రోజుకు ఎంత మందిని రోగులను ఇక్కడి నుంచి పంపిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు.వైద్యుల గదులు పరిశీలించి సేవలపై ఆరా తీశారు.రోజుకు ఎంతమందిని ఓపి చూస్తారో అడిగి తెలుసుకున్నారు.ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఆసుపత్రి సూపరిండెంట్ ఈశ్వర్ ప్రసాద్ కలెక్టర్‌ను కోరారు. ఈ ప్రాంతంలో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయని, ప్రమాదంలో గాయపడి క్షతగాత్రులు మొదటిగా వచ్చేది నక్కపల్లి ఆసుపత్రికేనని, తప్పనిసరిగా ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేసే విధంగా చూడాలని కోరారు. బెర్త్‌లు చాలక పోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని, బెర్త్ లు ఇప్పించాలని, అదనంగా శానిటేషన్ సిబ్బందిని నియమించాలని కోరారు.ఆసుపత్రి ఆవరణంలో హెటిరో ఆర్థిక సాయంతో నిర్మిస్తున్న వాటర్ ప్లాంట్ ను పరిశీలించారు. వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో పాటు, స్కానింగ్ యంత్రాన్ని కూడా హెటిరో యాజమాన్యం సమకూర్చిందని కలెక్టర్ దృష్టికి సూపరింటెండెంట్ తీసుకువెళ్లారు. దీంతో కంపెనీ ప్రతినిధులు సుబ్బారెడ్డి ,సుధాకర్ లను కలెక్టర్ అభినందించారు.మండల పరిషత్ నిధుల నుండి అత్యవసరంగా బోరు వేసి నీటి సమస్యను పరిష్కరించారని సూపరింటెండెంట్ చెప్పడంతో ఎంపీపీ, వైస్ ఎంపీపీ,అధికారులను కలెక్టర్ అభినందించారు.బాత్ రూమ్ లలో రోగులు వాడే నీరు నిల్వ ఉండిపోతుందని, బయటకు వెళ్లడం లేదని దీంతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు రోగులు కలెక్టర్ దష్టికి తీసుకువెళ్లారు .మండలంలోని కాగిత పంచాయితీ కి ఏకగ్రీవ నిధులు మంజూరు అయ్యేవిధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను సర్పంచ్ రాజేష్ కోరారు. నక్కపల్లి డిగ్రీ కళాశాల నిర్మాణానికి సంబంధించి స్థల కేటాయింపుకు ఆమోదం చేయాలని వైస్ ఎంపీపీ నానాజీ కోరారు. రెండుసార్లు వేలిముద్రం వేయించుకొని సరుకులు ఇవ్వడం ఇబ్బందిగా ఉందని సమస్య పరిష్కరించాలని కలెక్టర్ కు ఇంటింటికి రేషన్ సరుకులు సరఫరా చేస్తున్న వాహనదారులు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే గొల్ల బాబురావు తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్‌తో ప్రత్యేక సమావేశం అయ్యారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈపిఓపి ర్ డి.వెంకటనారాయణ, ఏవో సీతారామరాజు, ఎంఈఓ నరేష్, వైస్ ఎంపీపీ నానాజీ, వైసిపి మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి, నాయకులు సురకాసుల గోవింద్, ఫార్మసిస్ట్ హిమామ్, రామచంద్ర పాల్గొన్నారు.


వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ రవి సుభాష్

ఓటర్ జాబితా వెరిఫికేషన్

నక్కపల్లి:మండలంలోని దేవవరంలో గురువారం జిల్లా కలెక్టర్ రవి సుభాష్ ఓటర్ జాబితా వెరిఫికేషన్ ను పరిశీలించారు. ఇటీవలా గ్రామంలో బూత్ లెవెల్ అధికారులు ఇంటింటా ఓటరు సర్వే చేపట్టి, మార్పులు, చేర్పులు, తొలగింపులు చేపట్టారు. ఇవన్నీ పక్కగా ఉన్నాయా లేదా అని కలెక్టర్ పరిశీలించారు. డెత్‌లకు సంబంధించిన పేర్లను తొలగించడంతో, ఆయా కుటుంబ సభ్యులతో మాట్లాడి నిర్ధారించుకున్నారు. సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జగనన్న కాలనీకి అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని సర్పంచ్ భర్త గొర్ల నరసింహమూర్తి కలెక్టర్‌ను కోరారు. రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని స్థానిక అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో సీతారామరాజు ,బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.


సంచరిస్తున్న కుక్కలు

కుక్కల స్వైర విహారం

ప్రజాశక్తి-యస్.రాయవరం:మండల కేంద్రమైన రాయవరంలో కుక్కల బెడదతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. రాయవరం మెయిన్ రోడ్డు, హైస్కూల్ రోడ్డు, గురజాడ మెయిన్ జంక్షన్ కర్రివీధి తదితర ప్రాంతాలలో కుక్కలు రోడ్లపై స్వైర విహారం చేస్తున్నాయి. రోడ్లపై వెళ్ళే పాదచారులు, చిన్నారులపై తమ ప్రతాపం చూపిస్తున్నాయి. దీంతో, మండలకేంద్రంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయమై స్థానిక పంచాయితీ కార్యదర్శిని వివరణ కోరగా... కుక్కలను పట్టుకుని చంపేందుకు అనుమతి లేదన్నారు. వాటికి పశు వైద్యాధికారితో పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించాలన్నారు.


మంజూరు పత్రాన్ని ఇస్తున్న ఎంపిపి

జగనన్న పెళ్లి కానుకతో లబ్ధి

ప్రజాశక్తి-గొలుగొండ:ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో ఇచ్చిన వాగ్దానం మేరకు పెళ్లి కానుకగా ఎస్సీ, ఎస్టీలకు లక్ష రూపాయలు, బిసి, మైనారిటీలకు 50 వేల చొప్పున అందజేస్తున్నారని వైస్ ఎంపీపీ జక్కు నాగమణి అన్నారు. ఈ మేరకు మండలంలోని జోగుంపేటలో ఇటీవల వివాహం చేసుకున్న వధువుల కుటుంబాలకు జగనన్న పెళ్ళికానుకను అందించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి మాట్లాడుతూ, ఈ జగనన్న పెళ్ళికానుకతో ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి అధికార ప్రతినిధి జక్కు అప్పలస్వామి నాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు పంచాడ నాగరాజు, కళ్లింపుడి శ్రీను, కుపరాల నర్సింగరావు, పారుపల్లి జమీలు, వీఆర్వో గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రారరంభిస్తున్న నిర్వాహకులు

కుట్టు శిక్షణ కోర్సు ప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ:స్వయం ఉపాధి శిక్షణలో భాగంగా ఉచిత కుట్టు శిక్షణ, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్స్‌ను గురువారం గొలుగొండ మండలం కొంకసింగి గ్రామంలో ప్రారంభించారు. సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షులు అధ్యక్షులు వైశ్యాధి కృష్ణంరాజు, స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా సమన్వయకర్త అన్నం శివ రాజశేఖర్, విద్యా జ్యోతి జిల్లా సమన్వయకర్త జి.శ్రీనివాసరావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అనకాపల్లి జిల్లాలో ఇది ఐదవ శిక్షణ కేంద్రం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొంకసింగి భజన మండలి కన్వీనర్ సత్యనారాయణ, ఏఎల్‌పురం సత్యసాయి భజన మండలి కన్వీనర్ వాసు, గొలుగొండ మండల ఇన్‌చార్జ సత్యనారాయణ, మండల గ్రామ సేవ ముఖ్య కార్యనిర్వాహక అధికారి రమణ, ట్రైనర్ కసవరాజు, పుణ్యవతి, గ్రామ సర్పంచ్ నూకరత్నం, వైసిపి పార్టీ మండల కార్యదర్శి సత్యనారాయణ, టీడీపీ నాయకులు వరహాలబాబు, మహిళలు పాల్గొన్నారు.

నర్సీపట్నం రోడ్డు విస్తరణపై
మున్సిపల్ సమావేశం రసాభాస

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాసగా సాగింది. గురువారం చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యతక్షన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇటు అధికారపాక్షం ప్రతిపక్షంతో పాటు జనసేన పార్టీ కౌన్సిలర్ వాదోపవాదనలతో సమావేశం ముగిసింది. అధికార పార్టీ కౌన్సిలర్లను తెలుగుదేశం పార్టీ 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి రోడ్డు విస్తరణ పై ధీటుగా నిలదీశారు. రోడ్డు విస్తరణ పై ప్రజలను పలు అనుమానాలు వేధిస్తున్నాయని ఈ అనుమానాలను అధికారులు నివృత్తి చేయాలంటూ వాదించారు. రోడ్డు వెడల్పు 80 అడుగులా? లేక 90 అడుగులా లేక 100 అడుగులా తెలియజేయాలని ప్రశ్నించారు. రోడ్డు విస్తరణపై సరైన విధానం లేకుండా చిరు వ్యాపారుల పొట్ట కొట్టారని ఆమె ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. సరైన ప్రణాళిక లేకుండా ముందుగా చిరు వ్యాపారుల షాపులను కూల దీయడంతో వారు రోడ్డున పడ్డారన్నారు.


ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు


సమాధానం ఇస్తున్న చైర్ పర్సన్

దీనికి వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ స్పందిస్తూ ఇంతకీ రోడ్డు విస్తరణ పై తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్ల వైఖరి ఏమిటని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ రోడ్డు విస్తరణ జరగలేదని, అటువంటిది ఎమ్మెల్యే గణేష్ సాహసోపేతంగా విస్తరణ పనులు ప్రారంభించడం జరిగిందని, మీరు దీనికి అంగీకారమా కాదా అని రామకృష్ణ నిలదీశారు. ఈ మాటకు కౌన్సిలర్ డబ్బీరు శ్రీకాంత్, దనిమిరెడ్డి మధు స్పందిస్తూ తాము ఎప్పుడూ పేదల పక్షాన నిలబడతామని రోడ్డు విస్తరణకు తాము అంగీకారం గతంలోనే తెలపడం జరిగిందని తెలిపారు. రోడ్డు విస్తరణలో నష్టపోతున్న యజమానులకు టీడీఆర్ బాండ్లు కాకుండా నష్టపరిహారాన్ని చెల్లించాలన్నారు.

కౌన్సిలర్ రామరాజు స్పందిస్తూ గిరిజన గ్రామమైన తమ గ్రామానికి విద్యుత్, తాగునీటి సౌకర్యాన్ని రోడ్డు సదుపాయాన్ని కల్పించాలని కోరారు. పారిశుధ్య కార్మికులకు కనీసం చేతికి తొడుక్కునే గ్లౌజులు ఇవ్వలేని పరిస్థితిలో మున్సిపాలిటీ ఉందని, సబ్బులు, నూనెల బిల్లులు ఇవ్వకపోవడం ఆశ్చర్యకరంగా ఉందని విమర్శించారు. అద్దేపల్లి సౌజన్య మాట్లాడుతూ, ప్రతి కౌన్సిల్ సమావేశంలోనూ పారిశుధ్యం పై ప్రశ్నిస్తూనే ఉన్నా స్పందించ లేదన్నారు.

చైర్పర్సన్ సుబ్బలక్ష్మి స్పందిస్తూ నెల రోజుల్లో పారిశుధ్య పరికరాలు పూర్తిస్థాయిలో వస్తాయని తెలిపారు.కమిషనర్ కనకారావు స్పందిస్తూ రోడ్డు విస్తరణ వంద అడుగులేనని, త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. కొందరు ఆమోదించినప్పటికీ మరికొందరు కోర్టుకు వెళ్లడంతో దీనిపై వేచి చూడాల్సి ఉందని ఆయన సమాధానం ఇచ్చారు.

శ్మశానవాటిక అభివృద్ధి పనులు పూర్తి

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, చిప్పాడ, దివీస్ సంస్థ, సిఎస్ఆర్ నిధులు రూ 32 లక్షలతో చిప్పాడలో శ్మశానవాటిక అభివృద్ధి పనులు పూర్తయినట్లు దివీస్ సిఎస్ఆర్ అధికారి నాగరాజు గురువారం తెలిపారు. పంచాయతీ సర్పంచ్ వి రమావతి, వైసిపి నాయకులు సూరిబాబు, రాజా రెడ్డి, గ్రామ పెద్దలు శివాజీ, ఈశ్వరరావు, పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.


దివీస్ నిధులతో అభివృద్ధి చేసిన శ్మశానవాటిక

2 నుంచి నృత్య నాటకోత్సవాలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ, కళాభారతి సంస్థ 37వ సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంగా ఈ నెల 2వ తేదీ నుంచి 7 వరకూ ప్రఖ్యాతి గాంచిన సంగీత కళాకారుల ప్రదర్శనలు ఉంటాయని కళాభారతి సంస్థ కార్యదర్శి జిఆర్‌కె.ప్రసాద్ (రాంబాబు) తెలిపారు. ఈ సందర్భంగా వయోలిన్ విద్వాంసులు పద్మశ్రీ డాక్టర్ అన్నవరపు రామస్వామికి నాద విద్యా భారతి పురస్కారం అందించనున్నట్టు చెప్పారు. గురువారం కళా భారతి ప్రాంగణంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తమ సంస్థ గత 36 సంవత్సరాలుగా కళలను ప్రోత్సహిస్తూ కళాకారులకు సహాయం చేస్తూ వస్తోందన్నారు. ఈ సంవత్సర వార్షికోత్సవాలను పురస్కరించుకుని జాతీయ సంగీత, నాటక ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జాతీయ పురస్కారంగా బహుమతి రూ.లక్ష, ప్రశంసా పత్రం, నూతన వస్త్రాలు, రూ. 2 లక్షలు విలువ చేసే స్వర్ణ కమలం, ప్రతిష్టాత్మకమైన “నాద విద్యా భారతి” బిరుదుతో సత్కరించనున్నట్లు వివరించారు. 2వ తేదీ సాయంత్రం 6 గంటల కార్యక్రమం ప్రారంభం అవుతుందని తెలిపారు. ప్రారంభోత్సవ సభకు ముఖ్య అతిథిగా భారత పూర్వ ఉప రాష్ట్రపతి డాక్టర్ ఎం.వెంకయ్య నాయుడు, నావికా దళ వైస్ అడ్మిరల్ జి. శ్రీనివాసన్ హాజరుకానున్నట్టు చెప్పారు. అన్ని కార్యక్రమాలకు ఉచితంగా ప్రవేశం కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కార్యక్రమాలు ఆహ్వాన పత్రికను అధ్యక్షులు ఎంఎస్ఎన్.రాజు, కార్యదర్శి గుమ్ములూరి రాంబాబు, పైడా కృష్ణప్రసాద్, సింధూరి గ్రంధి, మోహన్ దాస్ విడుదల చేశారు.


ఊరేగిస్తున్న భక్తులు

ఘనంగా మరిడిమాంబ జాతర

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని సిహెచ్.నాగాపురంలో మరిడిమాంబ జాతర గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. భారీ ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకుని పూజలు చేపట్టారు. యువతీ యువకుల తీన్మార్ డాన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పండుగ ఆద్యంతం నేత్రపర్వంగా సాగింది. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ యలమంచిలి రఘురామచంద్రరావు మాట్లాడుతూ, జాతరకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.